
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 24 అక్టోబరు 2025



తిరుపతి మహానగరిగా మారేందుకు తొలి అడుగు పడేక్రమంలోనే అడ్డుతగిలింది. ఓ ఎమ్మెల్యే అభ్యంతరం చెప్పడంతో తాత్కాలికంగా వాయిదా పడనుంది. కొన్ని పంచాయతీల విలీనంపై ప్రభుత్వ పెద్దలతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరినట్టు తెలిసింది. దీంతో శుక్రవారం జరగనున్న కౌన్సిల్ అజెండాలో చేర్చిన అంశంపై చర్చలేకుండా వాయిదా వేయనున్నారు. అయితే కొందరు వైసీపీ కార్పొరేటర్లు మాత్రం గ్రేటర్ తీర్మానాన్ని సమర్థిస్తున్నట్టు సమాచారం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

గ్రేటర్ ప్రతిపాదన వాయిదా!

- కౌన్సిల్లో తీర్మానానికి ముందే ఓ ఎమ్మెల్యే అభ్యంతరం
- కొన్ని పంచాయతీలపై చర్చించాకే నిర్ణయం
- నేడు తిరుపతి కార్పొరేషన్ సమావేశం

వైజాగ్, విజయవాడ తరహాలో తిరుపతిని అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. ఆ దిశగా తిరుపతిని గ్రేటర్ చేయాలని అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు. తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు మండలాలకు చెందిన 63 పంచాయతీలతో సిద్ధమైన ప్రతిపాదిత జాబితా మున్సిపల్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేసేందుకు అజెండాలో పొందుపరిచారు. నాలుగురోజుల క్రితం జరిగిన ప్రీకౌన్సిల్ మీట్‌లోనూ గ్రేటర్‌పై చర్చించారు. గ్రేటర్‌కు మేయర్ శిరీష కూడా సుముఖంగా ఉన్నట్టు తెలిసింది. కౌన్సిల్ తీర్మానాన్ని మహానగరిగా ఆమోదం కోరుతూ కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో గ్రేటర్‌లో విలీనమవుతున్న పంచాయతీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ ఎమ్మెల్యే అభ్యంతరం చెప్పడంతో వాయిదా పడనుంది. తిరుపతి కార్పొరేషన్ పరిధి చాలా తక్కువ. దీని పరిధి పెంచకపోతే అభివృద్ధి సాధ్యం కాదనేది ప్రభుత్వ వాదన. కాగా, తర్వాత జరగబోయే కౌన్సిల్ సమావేశంలో గ్రేటర్ అంశం ఉంటుందని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు.

గ్రేటర్ ప్రయోజనాలివీ..

పంచాయతీల నుంచి నగరపాలికలో చేరితే సత్వరం పురసేవలు అందుబాటులోకి వస్తాయి. నగరాభివృద్ధి వేగవంతమవుతుంది. రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి అభివృద్ధికి నిధులు అందుబాటులో ఉంటాయి. పరిశ్రమలు, ఐటీ పార్కులు, హౌసింగ్ ప్రాజెక్టులు విస్తరించేందుకు అవకాశం లభిస్తుంది. స్థానిక ఉద్యోగాలు పెరుగుతాయి. భూముల విలువ పెరిగే అవకాశం ఉంది. రాజకీయ ప్రాధాన్యం పెరుగుతుంది.

ప్రతికూలతలు

పంచాయతీ పరిధిలో వసూలు చేసే పన్నుల కన్నా మున్సిపల్ పరిధిలో ఎక్కువ. పంచాయతీలో భవన నిర్మాణ అనుమతులు సులభంగా వస్తాయి. కార్పొరేషన్ అయితే టౌన్ ప్లానింగ్ నిబంధనలు క్లిష్టంగా ఉంటాయి. పరిధి పెరగడం వల్ల సమర్థంగా సేవలు అందించడం కష్టం కావచ్చు.

గ్రేటర్ ప్రతిపాదిత పంచాయతీల సంఖ్య : 63
ప్రస్తుత మున్సిపల్ పరిధి : 30.17 కి.మీ
ఆదాయం : రూ.149 కోట్లు
ప్రతిపాదిత పరిధి : 299 కి.మీ
విలీనంతో వచ్చే ఆదాయం : రూ33 కోట్లు
నగర జనాభా : 4.52 లక్షలు
63 గ్రామాల జనాభా : 2.98 లక్షలు
ప్రభావిత మండలాలు : తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు

కాలనీల పేర్లు మార్పు

తిరుపతి స్కావెంజర్స్ కాలనీ పేరును స్వచ్ఛతేశ్వర కాలనీ, ఏకలవ్య కాలనీ, సుదాసు కాలనీ, శంభూకుల కాలనీల పేర్లను కౌన్సిల్ ముందు తీసుకురానున్నారు. జ్యోతి లెప్రసీ కాలనీ పేరునూ జ్యోతి కాలనీగా మార్చనున్నారు. ఎస్వీఎస్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డుకు మాజీ ఎమ్మెల్యే మబ్బు రామిరెడ్డి రోడ్డుగా పేరు పెట్టే అంశాన్ని అజెండాలో ఉంచారు. ఈట్ స్ట్రీట్ త్వరితగతిన ఏర్పాటుచేసేందుకు, ఉద్యోగుల పదోన్నతులు, పీఆర్వోల నియామకంతో పాటు పలు అభివృద్ధిపనులతో కూడిన 108 అంశాలపై చర్చించనున్నారు.

సీవోసీ భవనం పూర్తికి కసరత్తు

- రూ.25 కోట్ల రుణంపై నేడు కౌన్సిల్‌లో చర్చ

తిరుపతిలో కార్పొరేషన్ భవన నిర్మాణం పూర్తికి కసరత్తు మొదలైంది. రూ25కోట్ల రుణంతో ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని నగరపాలకసంస్థ సంకల్పిస్తోంది. దీనికి మంత్రి నారాయణ అంగీకరించినట్టు తెలిసింది. శుక్రవారం నాటి కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చించనున్నారు. 2018లో టీడీపీ హయాంలో స్మార్ట్ సిటీ నిధులతో సిటీ ఆపరేషన్ సెంటర్ (సీవోసీ) నిర్మించాలని ప్రతిపాదించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన మూడేళ్ళ తర్వాత రూ.71కోట్లతో భూమి పూజ చేశారు. రెండేళ్లలో 20 శాతం పనులు కూడా పూర్తిచేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఏడాదిలోనే 60 శాతం పనులు (మొత్తం 80 శాతం) పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు నిలిచిపోవడంతో మిగిలిన పనులను ఆపేశారు. మరో రూ.40కోట్లు ఉంటే భవనం పూర్తవుతుందని అంచనా. తొలుత రూ.25కోట్లు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తే ఆగిన పనులు మొదలు పెట్టొచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఐకానిక్ భవనంలా.. : శ్రీవారి నామాలు ప్రతిబింబించేలా.. సుమారు 1.5 ఎకరాల విస్తీర్ణంలో ఐదు అంతస్తులతో సీవోసీ భవనం రూపుదిద్దుకుంటోంది. నగర భద్రతకు పెద్దపీట వేస్తూ కమాండ్ కంట్రోల్ వ్యవస్థతో పాటు సిటిజన్ సర్వీసెస్, ఎన్విరాన్మెంట్ సైన్సెస్, నీరు, విద్యుత్ వినియోగ వివరాలను ఈ సెంటరు నుంచి పర్యవేక్షించొచ్చు. పీజీఆర్ఎస్ వినతుల స్వీకరణకు ప్రత్యేక హాలు ఉండనుంది. ఇక, మేయర్, డిప్యూటీ మేయర్ల ఛాంబర్లు, కౌన్సిల్ సమావేశ మందిరంతో పాటు కమిషనర్ ఛాంబర్, విభాగాధిపతులకు ప్రత్యేక గదులు ఉంటాయి.



అసంపూర్తిగా ఉన్న సీవోసీ భవనం

విడవని వాన

- నిండిన చెరువులు, జలాశయాలు
- నీట మునిగిన 74 హెక్టార్ల వరిపంట

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం ఉదయం నుంచి వాన తెరపిచ్చినా.. సాయంత్రం మళ్లీ కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి చెరువులు, జలాశయాలు నిండాయి. ఇక, పిచ్చాటూరులో 72 హెక్టార్లలో వరిపైరు, పాకాలలో 2 హెక్టార్లలో వరిపైరు నీట మునిగింది. తొట్టంబేడులో రెండు ఎకరాల్లో కాకర పంట దెబ్బతింది. గురువారం ఉదయం నమోదైన వర్షపాతం వివరాలు.. పిచ్చాటూరులో 85.6మి.మీ, కేవీబీపురం 71.8, చిట్టమూరు 61.2, సత్యవేడు 57.8, నాగలాపురం 57.4, నాయుడుపేట 53, పుత్తూరు 50.8, వాకాడు 49.4, చిల్లకూరు 45.2, ఓజిలి 41, తొట్టంబేడు 38.6, గూడూరు 37.6, వరదయ్యపాళెం 37, శ్రీకాళహస్తి 36.2, డక్కిలి 35.6, ఏర్పేడు 35.4, తడ 33.4, బాలాయపల్లి 31.4మి.మీ.



బీఎన్‌కండ్రిగ మండలం కుక్కంబాకంలో చెరువుకు పడిన బొగడ

జిల్లా అధికారులతో సీఎం సమీక్ష

భారీ వర్షాల నేపథ్యంలో సీఎం చంద్రబాబు గురువారం దుబాయ్ నుంచి వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు హాజరయ్యారు. వర్షాల నష్ట నివారణకు జిల్లాలో తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ వివరించారు.



స్వర్ణముఖి బ్యారేజీ నుంచి దిగువకు వదులుతున్న వరద ప్రవాహం

స్వర్ణముఖి బ్యారేజీ నుంచి నీటి విడుదల

వాకాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీకి 9వేల క్యూసెక్కుల వరద ప్రవాహం రావడంతో 7 గేట్లను ఎత్తి 7,500 క్యూసెక్కుల నీటిని దిగువకు... మరో 500 క్యూసెక్కులను దుగరాజపట్నం చెరువుకు వదిలారు. ఈ నేపథ్యంలో బాలిరెడ్డిపాళెం వద్ద వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనకు ఇరువైపుల రాకపోకలు లేకుండా అధికారులు ఆనకట్టలు కట్టారు. 16 గ్రామాలకు పైగా రాకపోకలు ఆగాయి.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికి జాతీయ క్రీడా పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రీడాకారులు, కోచ్‌లు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీబీటీ వైఏఎస్-స్పోర్ట్స్‌జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9948444759ను సంప్రదించాలని కోరారు.

ఎస్పీడీసీఎల్‌లో భారీ అవినీతి

- సంతోష్‌రావు హయాంలో అక్రమాలు ప్రారంభం
- సీఎండీకి ఇంటెలిజెన్స్ మాజీ డీజీ ఏబీవీ ఫిర్యాదు

తిరుపతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం (ఎస్పీడీసీఎల్)లో భారీ అవినీతి జరిగిందని ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్, ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఆరోపించారు. గురువారం సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ ప్రతినిధులతో పాటు ఆయన తిరుపతి ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ శివశంకర్‌ను కలసి విద్యుత్ పరికరాల కొనుగోళ్ళలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలంటూ ఫిర్యాదు చేశారు. అనంతరం కార్యాలయం వెలుపల సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ వ్యవస్థాపకుడు నలమోతు చక్రవర్తితో కలసి మీడియాతోనూ ఆయన మాట్లాడారు. 'ఎస్పీడీసీఎల్‌లో అవినీతి కొత్త ఒక స్థాయికి పరిమితమై ఉండేది. 2023లో సీఎండీగా సంతోష్‌రావు వచ్చాకే భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు ప్రారంభమయ్యాయి. విద్యుత్ పరికరాల కొనుగోళ్లలో నిబంధనలు పాటించలేదు. అధిక ధరలతో కొనుగోలు చేశారు. వీటి వివరాలు కోరుతూ సమాచార హక్కు చట్టం కింద డజను సార్లు దరఖాస్తు చేసినా ఎస్పీడీసీఎల్ స్పందించలేదు. మా దరఖాస్తులపై మొదటి, రెండవ అప్పీళ్ళకు వెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో నల్లమోతు చక్రవర్తి రాత్రింబవళ్ళూ కష్టపడి ఆధారాలు సేకరించారు. కేసు వేయడానికి అవసరమైన వివరాలు సమకూర్చారు. నెలన్నర రోజులుగా రెండు మూడు వేదికల నుంచి ఈ వివరాలను ప్రజల ముందుంచుతున్నాం. మా ప్రయత్నాలు ఫలించో లేక యాదృచ్ఛికంగానో సంతోషరావును ఇటీవల ప్రభుత్వం రిలీవ్ చేసింది' అని ఏబీవీ పేర్కొన్నారు. తమ వద్దనున్న ఆధారాలతో ప్రస్తుత సీఎండీ శివశంకర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తాను కొత్తగా వచ్చినందున పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవడానికి కొంత వ్యవధి కోరారని ఆయన వివరించారు.



సదరన్ డిస్కం సీఎండీకి ఫిర్యాదు చేస్తున్న ఏబీ వెంకటేశ్వరరావు, నలమోతు చక్రవర్తి తదితరులు

ఆ అవినీతి భారం ప్రజలపైనే

ఎస్పీడీసీఎల్‌లో జరిగే అక్రమాలకు అంతిమంగా ప్రజలే బాధితులవుతున్నారని ఏబీ వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్ పరికరాలను అధిక ధరలకు కొంటే ఆ భారం వినియోగదారులైన ప్రజలపైనే పడుతుందన్నారు. రూపాయి వస్తువును రూ.మూడుకు కొంటే ఆ తేడాను ప్రజలే భరించాల్సి వస్తుందన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుంటే వారు పారిపోతారని, ఆ డబ్బు ఇప్పుడైనా, ఐదేళ్ల తర్వాతైనా చెల్లించాల్సింది ప్రజలేనన్నారు. 'ఇక ప్రజల నుంచి వసూలు చేసిన సర్‌ఛార్జీ రూ. 900 కోట్లు తిరిగి చెల్లించడానికి కూడా ఎస్పీడీసీఎల్ వాయిదాలు పెడుతోంది. యూనిట్‌కు 11 పైసలు చొప్పున ఆరు నెలల్లో తిరిగి చెల్లిస్తామంటున్నారు. అలా చేసినా ప్రజలకు ఎంతోకొంత ఉపశమనం కలిగించినట్లే' అని పేర్కొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఎస్పీడీసీఎల్‌లో అక్రమాలపై తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని వెంకటేశ్వరరావు,నల్లమోతు చక్రవర్తి వెల్లడించారు.గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను ఆహ్వానించామన్నారు. ఎస్పీడీసీఎల్‌లో అక్రమాలపై తమ వద్ద వున్న పూర్తి వివరాలను సమావేశంలో వెల్లడిస్తామన్నారు. రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలతో పాటు బాధ్యత కలిగిన ప్రజలెవరైనా వచ్చి తమ వద్ద వున్న సమాచారం ఇవ్వచ్చునన్నారు. వీరితో పాటు డాక్టర్ బాబు సింగిరి నలగాంపల్లి సురేష్ తదితరులున్నారు.

గూడూరు విద్యుత్ స్టోర్స్‌లో ఇద్దరిపై వేటు

తిరుపతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి లోతేటి శివశంకర్ ఎస్పీడీసీఎల్ సీఎండీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తన పనితీరెలా ఉంటుందో చాటుకున్నారు. గూడూరు మండలం నెల్లటూరులోని ఉమ్మడి నెల్లూరు జిల్లా విద్యుత్ స్టోర్స్‌లో అక్రమాలు జరిగాయని వచ్చిన ఫిర్యాదులపై ఆయన వేగంగా స్పందించారు. స్టోర్స్ ఏడీఈ పి.శంకరయ్య, ఏఈ బి.మల్లిఖార్జునను సస్పెండు చేశారు. ఈ వ్యవహారంతో సంబంధమున్న నెల్లూరు విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ విభాగ ఈఈ ఎస్.బాలచంద్రకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నెల్లటూరులోని ఈ స్టోర్ నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, జీఐ వైర్లు, ఇన్సులేటర్లు, కేబుల్ వైర్లు, ఎర్త్ వైర్లు తదితర పరికరాలు సరఫరా అవుతాయి. ఇందులో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులున్నాయి. ప్రధానంగా గత నెలలో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ నుంచి స్టోర్స్‌కు సుమారు 30 టన్నుల జీఐ వైరు రాగా అందులో కొంత దుర్వినియోగమైనట్లు సమాచారం. ఈ ఫిర్యాదులపై తిరుపతి నుంచి అధికారులు వెళ్లి తనిఖీ చేయగా 5 టన్నుల జీఐ వైరు తక్కువగా ఉన్నట్లు గుర్తించారని తెలిసింది. ఈ విషయం సీఎండీ దృష్టికి పోవడంతో వెంటనే చర్యలు చేపట్టారు.



శంకరయ్య



మల్లికార్జున

మండపానికి రాని పెళ్లికొడుకు

- పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన వధువు బంధువులు

పాకాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెళ్లి రిసెప్షన్‌కు సమయం గడిచిపోతున్నా పెళ్లికొడుకు మండపానికి రాలేదు. దీంతో వధువు బంధువులు వెతుకులాట ప్రారంభించారు. ఎంతకీ రాకపోయేసరికి పోలీసు స్టేషన్‌కు పరుగులు తీశారు. వివరాల్లోకెళితే.. పాకాల మండలానికి చెందిన వధువుకు.. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి చెందిన వరుడితో నిశ్చితార్థమైంది. గురువారం ఆనందగిరి ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో పెళ్లి రిసెప్షన్, విందు జరగాల్సి ఉంది. శుక్రవారం ఉదయం 9-10 గంటలకు పెళ్లి జరగాలి. రిసెప్షన్ కోసం వధువు సిద్ధమై ఎదురు చూస్తుండగా వరుడు రాలేదు. దీంతో ఆందోళన చెందిన వధువు బంధువులు పాకాల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. పెళ్లి కొడుకు కోసం బంధువులు, పోలీసులు గాలిస్తున్నారు.

చేపలకు వెళ్లి ఇద్దరి గల్లంతు

రెండు మండలాల్లో చేపలకని వెళ్లి ఇద్దరు గిరిజనులు గల్లంతయ్యారు. కాళంగి నది ప్రవాహంలో మేకల పోలయ్య.. చల్లకాలువనదిలో మాణికల పోలయ్య కొట్టుకుపోయారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న కాళంగి నది



చల్లకాలువలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు


కాళంగి నదిలో జారిపడి..



మేకల పోలయ్య

దొరవారిసత్రం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కమ్మకండ్రిగ సమీపంలో గురువారం ఉదయం కాళంగి నదిలో మేకల పోలయ్య(31) గల్లంతయ్యారు. పోలిరెడ్డిపాళెం గిరిజన కాలనీకి చెందిన ఈయన కాళంగి నదిపై తనియాలి ఆనకట్ట(కలుజు) వద్ద చేపలు పట్టేందుకు వెళ్లారు. నిండుగా వరద నీరు ప్రవహిస్తుండగా, వలతో చేపలు పట్టే క్రమంలో కాలుజారి నదిలో పడిపోయారు. వరద తాకిడికి కొట్టుకుపోయారు. పోలయ్యతో పాటు వేటకు వెళ్లిన మరో ముగ్గురు గిరిజనులు గ్రామస్థులకు, వీరు పోలీసులకు సమాచారమిచ్చారు. తహసీల్దారు శైలాకుమారి, ఎస్ఐ అజయ్‌కుమార్ ఘటనా స్థలిని పరిశీలించారు. స్థానికుల సాయంతో పోలయ్య ఆచూకీ కోసం ప్రయత్నించారు. నిండుగా ప్రవహిస్తున్న నదిలో గాలింపు చర్యలు చేపట్టడం సాధ్యం కాని పని కావడంతో గాలింపు చర్యలు చేపట్టలేదు. సాయంత్రానికి కూడా పోలయ్య ఆచూకీ లభ్యం కాలేదు.

చల్లకాలువలో వరద పెరిగి..



మాణికల పోలయ్య

కోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కర్లపూడి పంచాయతీలోని మేకలతోట గిరిజన కాలనీకి చెందిన మాణికల పోలయ్య, స్నేహితుడితో కలిసి గురువారం చల్లకాలువ నదిలో గేలం ద్వారా చేపలు పట్టేందుకు వెళ్లారు. పెద్దగా చేపలు పడకపోవడంతో చివరగా.. గేలాలతో పాటు వలను నదిలోని నీటి ప్రవాహంపై విసిరారు. వల రాకపోడంతో పోలయ్య దానిని పట్టుకుంటూ వెళ్లారు. హఠాత్తుగా వరద పెరగడంతో కొట్టుకుపోయారు. స్నేహితుడి సమాచారంతో గిరిజనులు, తహసీల్దారు జయజయరావు, ఎస్ఐ పవన్‌కుమార్, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, అగ్నిమాపక అధికారి శ్రీనివాసులు, సిబ్బంబది అక్కడికి చేరుకున్నారు. కర్లపూడి వంతెన నుంచి గాలించినా ఆచూకీ లభించలేదు. గోవిందపల్లిపాళెంలోని గజ ఈతగాళ్ల పిలిపించి బోట్లతో గాలించినా ఆయన జాడలేదు.



ఆలయం ముందు తేజ సజ్జా, కార్తీక్ ఘట్టమనేని

స్వామికి థ్యాంక్స్ చెప్పడానికి వచ్చాం

● 'మిరాయ్' హీరో తేజ సజ్జా

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): 'మిరాయ్' చిత్రం విజయాన్ని సాధించిన నేపథ్యంలో స్వామికి థ్యాంక్స్ చెప్పుకునేందుకు వచ్చామని ఆ చిత్ర హీరో తేజ సజ్జా తెలిపారు. చిత్ర దర్శకుడు కార్తీక్ ఘట్టమనేనితో కలిసి ఆయన గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తన చిన్నతనం నుంచి స్వామి దర్శనానికి వస్తున్నానని, ఈసారి స్వామివారే పిలిపించుకున్నారనే విధంగా అద్భుతమైన దర్శనం లభించిందన్నారు. ఇంకా పెద్ద ఆలోచనలు ఉన్నాయని, రాబోయే సినిమాల గురించి త్వరలో ప్రకటిస్తానని తెలిపారు. ప్రతి సినిమా విడుదల, అనంతరం తిరుమలకు రావడం తనకు ఆనవాయితీ అని దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని చెప్పారు. అంతకుముందు కార్తీక్ శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

అప్పటికి ఇప్పటికి తిరుమలలో ఎంతో వ్యత్యాసం

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): గతానికి, ప్రస్తుతానికి తిరుమలలో ఎంతో వ్యత్యాసం కనిపిస్తోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. దర్శనం, వసతి, ప్రసాదాల్లో పూర్వవైభవం కనిపించడంతో పాటు ఈ ప్రాంతాన్ని మరింత పవిత్రంగా ఉంచాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గతంలో జరిగిన నష్టాన్ని పరిష్కరించుకుంటూ శ్రీవారి సేవలు, దర్శనం అందుబాటులో ఉండేలా చేయగలిగే సమర్థతను చూస్తున్నామన్నారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.47కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,853

తలనీలాలు సమర్పించినవారు: 22,551





చిగురువాడ వద్ద స్వర్ణముఖిలోకి వదులుతున్న డ్రైనేజీ నీరు

స్వర్ణముఖిలోకి వ్యర్థ నీరు

● గుట్టుచప్పుడు కాకుండా వదులుతున్న వైనం ● పట్టించుకోని పంచాయతీ పాలకులు



డ్రైనేజీ వ్యర్థాలను నదిలోకి మళ్లించేందుకు తీసిన గోతులు

తిరుపతిరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని పలు గ్రామాలు నగరానికి చేరువగా ఉండటంతో పదుల సంఖ్యలో సంస్థలు, అపార్ట్‌మెంట్లు వెలుస్తున్నాయి. విద్యాసంస్థలకు అనుబంధంగా వసతిగృహాలను కూడా నిర్వహిస్తున్నారు. భవన యజమానులు(బిల్డర్లు) తుడా అనుమతితో పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు నిర్మించి విక్రయిస్తున్నారు. అయితే వీటినుంచి వెలువడే డ్రైనేజీ, టాయిలెట్ వ్యర్థాల నిర్వహణకు ఆ ప్రాంగణాల్లో సోర్టేజీ సెప్టిక్‌ట్యాంక్‌లను ఏర్పాటు చేయలేదు. దీంతో గుట్టుచప్పుడు కాకుండా స్వర్ణముఖి నదిలోకి మళ్లిస్తున్నారు. నదిలోని నీరు కలుషితమై, వీటిని తాగి పశువులు, జీవాలు మృత్యువాతపడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నదిలో తాగునీరు బోర్లను ఏర్పాటు చేసుకుని పైప్‌లైన్ల ద్వారా వినియోగించుకుంటున్నారు. ఈ బోర్లకు సమీపంలో మురుగు, వ్యర్థాలను వదులుతుండడంతో తాగునీరు కలుషితమై వ్యాధులు వచ్చే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ పాలకులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా తమకేమీ పట్టనట్లు మిన్నకుండిపోతున్నారని వాపోతున్నారు. ఆర్సీపురానికి వెళ్లే మార్గంలో కేసీపేట, దుర్గసముద్రం, చిగురువాడ, వేదాంతపురం గ్రామాల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు అనుబంధంగా నడుస్తున్న వసతిగృహాల్లో వేలాది మంది విద్యార్థులు ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీ నీరు బయటకు వదులుతుండటం విమర్శలకు తావిస్తోంది.

పలు పంచాయతీల్లో ఇలా: దుర్గసముద్రంలో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ విద్యాసంస్థకు చెందిన డ్రైనేజీ నీటిని వదిలేందుకు రెండు కిలోమీటర్లకు పైగా గ్రామ సిమెంటు రోడ్డును ఛిద్రంచేసి నది వరకూ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. చిగురువాడ ముఖద్వారంలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ విద్యాసంస్థకు చెందిన డ్రైనేజీ, వ్యర్థాలను సమీపంలోని కాలువమీదుగా నదిలోకి వదులుతున్నారు. ఇదేపంచాయతీలోని వైఎస్సార్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ నిర్వాహకులు డ్రైనేజీ వ్యర్థాలను నదిలోకి మళ్లించేందుకు ఇటీవల గోతులు తీశారు. గ్రామస్తులు అడ్డుకోవడంతో పనులను నిలుపుదల చేశారని తెలిసింది. కేసీపేటలోని విద్యాసంస్థకు చెందిన డ్రైనేజీ వ్యర్థాలను సమీపంలోని స్వర్ణముఖిలోకి మళ్లించారని తెలిసింది.



జస్టిస్ శ్యాంప్రసాద్ - జస్టిస్ అరుణ్‌కుమార్ - జస్టిస్ వైశాలి పటేల్

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్యాంప్రసాద్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైశాలి పటేల్, జార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్‌కుమార్ ఉన్నారు.

రేపే ఆఖరు

జాతీయ ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తుది గడువు శనివారమే. ఈ రెండు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, ప్రతిభావంతులైన విద్యార్థులు జాతీయ ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్ఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోండి. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఇప్పటివరకు జిల్లాలో 2,923 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

180 మార్కులకు ప్రశ్నపత్రం



ప్రతిభా పరీక్ష డిసెంబరు నెలలో నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించే తేదీన మూడు గంటల పాటు పరీక్ష జరుగుతుంది. మొత్తం 180 మార్కులకు రెండు విభాగాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది. మెంటల్ ఎబిలిటీకి 90 మార్కులు, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలకు సంబంధించి 90 మార్కులకు మల్టిపుల్ చాయిస్ రూపంలో ప్రశ్నపత్రం ఉంటుంది.

- కె.వి.ఎన్.కుమార్, డీఈవో

అర్హులు ఎవరంటే?

ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. ఓసీ, బీసీ విద్యార్థులు 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. అలాగే వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల్లోపు ఉండాలి. విద్యార్థులు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ. 50లు పరీక్ష రుసుం చెల్లించాలి.



నిండుకుండలా పాకాల పెద్దచెరువు

చెరువులకు జలకళ

పాకాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలోని కుంటలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. కోనేటి చెరువు, కుళ్లప్పరెడ్డిచెరువు, నాయనిచెరువు,కళ్యాణరామన్నచెరువు, దేశిరెడ్డివానిచెరువు, రామసముద్రం చెరువు, పాపిరెడ్డిచెరువు, మొగరాల చెరువు, అమ్మచెరువు, పదిపుట్లబైలు రిజర్వాయర్, పాకాల పెద్దచెరువు, మల్లేశ్వరస్వామివారిచెరువు, వెంకట్రాయనిచెరువు, కళ్యాణరామన్న చెరువులు నిండాయి. సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదని మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేబుల్ వైరు చోరీ

పాకాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాకాల పంచాయతీ శివశక్తినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్ వైరు చోరీ చేశారు. బుధవారం రాత్రి కిటికీ గ్రిల్స్ వంచి బోరు మోటారుకు, ఇంటి లోపల అమర్చి ఉన్న వైర్లు తీసుకెళ్లిపోయారు. ఇంటి యజమాని పి.మోహన్ పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోతకు గురైన నాగయ్యగారిపల్లె స్వర్ణముఖి కల్వర్టు



కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహన్ - కల్వర్టుపై ఏర్పాటు చేసిన బోర్డు

చంద్రగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యగారిపల్లె వద్దవున్న స్వర్ణముఖి నది కల్వర్టు కోతకు గురైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గతంలో కురిసిన వర్షాలకు నాగయ్యగారిపల్లె వద్ద పైపులతో తాత్కాలికంగా కల్వర్టు నిర్మించారు. ప్రస్తుతం కోతకు గురైంది. గురువారం తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య పరిశీలించారు. కల్వర్టుపై ప్రయాణించరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కళ్యాణి డ్యామ్‌లో పెరుగుతున్న నీటిమట్టం

● శేషాచలం అడవి నుంచి భారీగా చేరుతున్న వరద నీరు

చంద్రగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యాణి డ్యామ్‌లో నీటిమట్టం పెరుగుతోంది. తుఫాన్ కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి శేషాచలం అడవి నుంచి వరద నీరు డ్యామ్‌లోకి చేరుతోంది. తుఫాన్‌కు ముందు డ్యామ్‌లో 836 అడుగులు ఉండగా బుధవారం రాత్రికి 851 అడుగులకు చేరింది. గురువారం సాయంత్రానికి 856 అడుగులకు చేరిందని డ్యామ్ అధికారులు తెలిపారు. శేషాచలం అడవుల్లోని రాగిమానుకోన, అనుమకోన, అబ్బాలమేరు, చీకుమానుకోన, గుండాలపెంట వాగుల నుంచి వరద నీరు డ్యామ్‌లోకి వస్తోంది.

● ముక్కంటి ధర్మకర్తల మండలిలో

నేడు కొందరు సభ్యుల ప్రమాణం

శ్రీకాళహస్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలిలో టీడీపీ తరఫున నియమితులైన సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మండలిలో తొలిసారిగా వివిధ నియోజకవర్గాల నుంచి సభ్యులను ఎంపిక చేశారు. దీంతో సభ్యులు ఎవరికి వారు తమకు అనువైన ముహూర్తాలను ఖరారు చేసుకున్నారు. దీంతో టీడీపీ నుంచి నియమితులైన గుర్రప్ప శెట్టి, గాది పాకుల గోపీనాథ్, లక్ష్మి శుక్రవారం సాయంత్రం ముక్కంటి ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ గురువారం తెలిపారు.

ఉధృతంగా తలకోన ఏరు ప్రవాహం



జలపాత సోయగం - జోరుగా ప్రవహిస్తున్న తలకోన ఏరు

● కోటకాడపల్లెకు తెగిన సంబంధాలు

ఎర్రావారిపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి); బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శేషాచల కొండల్లో కురుస్తున్న భారీ వర్షానికి తలకోన ఏరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తలకోన అడవుల నుంచి వలసపల్లె మీదుగా వెళ్లే తలకోన ఏరు కోటకాడపల్లె రోడ్డు వద్ద జోరుగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కోటకాడపల్లె పంచాయతీలోని వీర్‌కాలనీ, వేములవాడ, తడికినుచేనుపల్లె, అయ్యగారిపల్లె, బోయపల్లె, ఓఎస్ గొల్లపల్లె, చెంగాడవాండ్లపల్లె, అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం దిన్నెల గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఎంపీడీవో మదన్‌మోహన్‌రాజు అధికారు లతో కలిసి తలకోన ఏరు వద్దకు వెళ్లి పరిస్థితి అంచనా వేశారు. ప్రవాహం ప్రమాద కరంగా ఉండటంతో రాకపోకలకు అనుమతించలేదు. తలకోన పర్యాటక ప్రాంతానికి పర్యాటకుల రాకపోకలను నిషేధించారు. ఎస్సై బాలకృష్ణయ్య మండలంలో పర్యటించి, ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షానికి కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది.

రెగ్యులర్.. కాదు ఎఫ్ఏసీ

● 24 గంటల్లో భిన్న ఉత్తర్వులు

● గందరగోళంలో స్కిట్ ప్రిన్సిపాల్ నియామకం

కలికిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని స్కిట్ కళాశాల అనంతపురం జేఎన్టీయూ వర్సిటీలో విలీనమైంది. ఇక నుంచి ఈ కళాశాలను జేఎన్టీయూ-స్కిట్ పేరుతో వ్యవహరించాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రిన్సిపాల్ నియామకంపై 24 గంటల్లో భిన్న ఉత్తర్వులు జారీ కావడంతో గందరగోళం నెలకొంది. తొలుత కలికిరి జేఎన్టీయూ కళాశాల ప్రస్తుత ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావును స్కిట్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ బుధవారం రాత్రి జేఎన్టీయూ రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణం రిలీవ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన స్థానంలో కలికిరి కళాశాలలోనే ఈసీఈ విభాగాధిపతి ఆర్.రమణారెడ్డిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ మరో ఉత్తర్వును జారీ చేశారు. గురువారం ఉదయానికల్లా.. బుధవారం నాటి ఉత్తర్వును సవరిస్తూ మరో ఉత్తర్వు వచ్చింది. కలికిరి ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావును స్కిట్ ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తున్నట్లు.. ముందు రోజు ప్రిన్సిపాల్‌గా నియమించిన ప్రొఫెసర్ రమణారెడ్డిని కలికిరి కళాశాలకు వైస్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న కె.త్యాగరాజన్‌ను తొలగించి ఫిజిక్స్ విభాగాధిపతిగా పరిమితం చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. కాగా, కలికిరి కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పూర్తి బాధ్యతలతో పనిచేసే వెంకటేశ్వరరావు ఇక్కడి నుంచి 120 కి.మీ. దూరంలోని స్కిట్ కళాశాలలో అదనపు బాధ్యతలను ఎలా నిర్వహిస్తారు? ఈ నియామకాల్లో గందరగోళం వెనుక కారణాలేంటనేది చర్చనీయాంశమైంది.

రాయలచెరువును పరిశీలించిన ఎమ్మెల్యే నాని



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

రామచంద్రాపురం, అక్టోరు 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని రాయలచెరువును ఎమ్మెల్యే నాని గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువు కట్టతోపాటు మొరవను పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చెరువులో 40 శాతం మాత్రమే నీరు చేరినందున ఎలాంటి ఇబ్బందులూ లేవని ఇరిగేషన్ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. చిట్టత్తూరు, కాళేపల్లె రైతులు తమ పంట నీట మునిగిందని, ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రతి రైతునూ ఆదుకోంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, సింగిల్‌విండో చైర్మన్ జనార్దన్‌చౌదరి, నాయకులు నరసింహారెడ్డి, హరిప్రసాద్, ఉమాపతినాయుడు, సురేంద్రనాయుడు, త్యాగరాజులు, తహసీల్దార్ మధుసుదన్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎస్ఐ భక్తవత్సలం పాల్గొన్నారు.

105 మందికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు



క్యాన్సర్ పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పాకాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు మ్యాంగోనగర్ ఆర్ఆర్ కల్యాణ మండపంలో గురువారం పింక్ బస్సు ద్వారా 105 మందికి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి, లయన్స్ క్లబ్ దామలచెరువు మ్యాంగోనగర్ సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. హాజరైన మహిళలు, పురుషులకు క్యాన్సర్ వ్యాధి లక్షణాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిబాషా, రీజనల్ చైర్‌పర్సన్ రామయ్య, స్విమ్స్ వైద్యులు డాక్టర్ పద్మావతి, పీఆర్వో చంద్రమోహన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నాగూర్ బాషా, నాగూర్, నిజాముద్దీన్, కేఎస్ మస్తాన్, ఇమ్రాన్, మాధవి, అన్సర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహప్రతిష్ఠ

రామచంద్రాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మకండ్రిగ ఆదిఆంధ్రవాడలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఉదయం వైభవంగా జరిగింది. నూతనంగా నిర్మించిన ఆలయంలో మంగళవారం నుంచి వివిధ హోమాలు, పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం 10 గంటలకు పూర్ణాహుతితో కుంభాభిషేకం ముగిసింది. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు మేళ తాళాల నడుమ జరిగింది. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త లంబోధరనాయుడు, దాతలు, సర్పంచ్ కాకర్ల కావ్య, వేణుగోపాల్‌నాయుడు దంపతులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

అనారోగ్యంతో ఉద్యోగి మృతి



నరేష్ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ రిజిస్ట్రార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ నరేష్ అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నేంద్రగుంటలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నరేష్ మృతికి సంతాప సూచకంగా యూనివర్సిటీ పరిపాలనా భవనంతోపాటు ఇతర ముఖ్య విభాగాలకు గురువారం సెలవు ప్రకటించారు.

రాఘవులు నాయుడికి నివాళి



రాఘవులు నాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఎకనమిక్స్ విభాగ రిటైర్డు ప్రొఫెసర్ రాఘవులు నాయుడికి ఎకనమిక్స్ విభాగం ఘన నివాళి అర్పించింది. రాఘవుల నాయుడు కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. ఎకనమిక్స్ విభాగంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. ఎకనామిక్స్ విభాగాధిపతి కె.రాధిక, బీవోఎస్ చైర్‌పర్సన్ ఆర్.సునీత మాట్లాడుతూ రాఘవుల నాయుడు ఎకనమిక్స్ విభాగ అభివృద్ధికి చేసిన కృషి అభినందనయమని పేర్కొన్నారు. అనేకమంది పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీలు అందించడంలో ఆయన కీలక పాత్ర వహించారని తెలిపారు. హెచ్‌వోడీగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్స్ సుబ్రహ్మణ్యం, ప్రతాప్, గీతా కుమారి, రమేష్, పరిశోధక విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కఠారి దంపతుల హత్యకేసులో నేడు తుది తీర్పు

● పదేళ్ల విచారణ తరువాత వెలువడనున్న జడ్జిమెంట్

● 21మంది నిందితులు, 122మంది సాక్షుల విచారణ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పదేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అప్పటి చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త మోహన్ హత్య కేసుకు సంబంధించి శుక్రవారం తుదితీర్పు వెలువడనుంది. పదేళ్ల సుదీర్ఘ విచారణ తరువాత జిల్లా కేంద్రంలో ఉన్న ప్రత్యేక మహిళా న్యాయస్థానం ఈ కేసుకు సంబంధించిన తీర్పును వెలువరించనుంది. 2015 నవంబరు 17వ తేదీన ఉదయం చిత్తూరు నగర పాలక కార్యాలయం తుపాకుల కాల్పులతో, కత్తిపోట్లతో హోరెత్తింది.చిత్తూరు కార్పొరేషన్ తొలి మేయర్ అనురాధతో పాటు మున్సిపల్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడైన ఆమె భర్త కఠారి మోహన్ వారి ఛాంబర్లలో ఉన్నారు.ఇంతలో బురఖా ధరించిన కొంతమంది కత్తులు, తుపాకులతో కార్యాలయంలోకి వచ్చారు. మేయర్ అనురాధను ఆమె ఛాంబర్‌లో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకీతో కాల్చడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయారు.కాల్పుల శబ్దం విని వచ్చిన ఆమె భర్త కఠారి మోహన్ అక్కడి దృశ్యం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే దుండగులు కత్తులతో అతడి వెంటపడ్డారు.ప్రాణభయంతో కౌన్సిల్ హాలు గుండా పరుగెత్తగా కత్తులతో పొడిచి పారిపోయారు.తీవ్రగాయాలతో రక్తమోడుతున్న మోహన్‌ను వెంటనే వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించగా అదేరోజు సాయంత్రం ఆయన కూడా మృతి చెందారు.మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కఠారి మోహన్ మేనల్లుడు చింటూను ప్రధాన నిందితుడిగా చూపించిన పోలీసులు..ఈ జంట హత్యలకు సంబంధముందని 23 మందిని అరెస్టు చేశారు.వీరిలో శ్రీకాళహస్తికి చెందిన కాసరం రమేష్ అనే వ్యక్తికి హత్యలతో సంబంధం లేదని గతంలోనే న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. మరో నిందితుడు శ్రీనివాసాచారి కేసు విచారణలో ఉండగానే అనారోగ్యంతో మృతి చెందాడు. మిగిలిన 21మందిలో చింటూ ప్రధాన నిందితుడు కాగా వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేశ్, మురుగన్, యోగానంద్, పరంధామ, దాసు, మొగిలి, శశిధర్, యోగానందం, ఆర్వేటి బాబు, లోకేష్, రఘుపతి, నాగరాజు, ఆనంద్‌కుమార్, కమలాకర్, రజనీకాంత్, నరేంద్రబాబు, సురేష్ పేర్లను పోలీసులు ఛార్జిషీట్‌లో దాఖలు చేశారు.ఈ పదేళ్ల కాలంలో మొత్తం 122 మంది సాక్షులను విచారించిన జిల్లా జడ్జి శ్రీనివాసరావు శుక్రవారం తీర్పు వెలువరించనున్నారు.

200మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మేయర్ దంపతుల హత్య కేసుకు సంబంధించి శుక్రవారం తీర్పు వెలువడనున్న నేపథ్యంలో పోలీసుశాఖ అప్రమత్తమైంది. కోర్టు ఏ తీర్పు ఇచ్చినా...కోర్టు ఆవరణతో పాటు నగరంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలతో పాటు 179 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. వీరు కోర్టు ప్రాంగణంతో పాటు కఠారి కుటుంబం , చింటూ నివాసాలున్న గంగనపల్లె, ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తును నిర్వహించనున్నట్లు డీఎస్పీ సాయినాథ్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


బాధితులతో ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. 12వ డివిజన్ కెనడీనగర్‌కు చెందిన మల్లిశెట్టి కుమారికి రూ.2.20 లక్షలు, 3వ డివిజన్ పోస్టల్ కాలనీకి చెందిన గంగాధర్‌రెడ్డికి రూ.2.77లక్షలు, 5వ డివిజన్ మారుతీనగర్‌కు చెందిన మువ్వాల వాసుకు రూ.1.16లక్షలు అందజేశారు. బాధితులు ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, నీలాద్రి, జె.కె.రాయల్ పాల్గొన్నారు.

30న ఆర్టీసీ వైద్యశాల ప్రారంభం


ప్రారంభానికి సిద్ధమైన వైద్యశాల

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఆర్టీసీ వైద్యశాల ఈ నెల 30న ప్రారంభానికి సిద్ధమైంది. సెంట్రల్ బస్టాండులోని డీపీటీవో కార్యాలయం వెనుక ఇరుకు స్థలంలో ఉన్న వైద్యశాల అసౌకర్యంగా ఉండటంతో అటు ఆర్టీసీ ఉద్యోగులు, వైద్యశాల సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీన్ని గుర్తించిన ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు అనుమతితో అలిపిరి రోడ్డు డ్రైవర్స్ క్వార్టర్స్‌లోని దాదాపు 10సెంట్ల ఖాళీ స్థలంలో రూ.4కోట్లతో నూతన భవనాన్ని నిర్మించారు. ఆధునిక సదుపా యాలు కల్పించారు. పనులన్నీ పూర్తి కావడంతో 30న రవాణా శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా ఎస్పీడబ్ల్యూ ఉమెన్ టీం


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భువనేశ్వరి

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్జీఎఫ్ అండర్ 19 అంతర్ జిల్లా రెజ్లింగ్ చాంపియన్‌గా శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల జట్టు నిలిచింది. విజయవాడ వేదికగా ఈ నెల 21నుంచి 22వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఎస్పీడబ్ల్యూ ఉమెన్ జట్టు అన్ని జట్లపై విజయం సాధించి, ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఆర్.లక్ష్మీలావణ్య(బంగారు), కె.రెడ్డిజీవన(వెండి), ఎస్.వైష్ణవి(వెండి), కె.శశిరేఖ(కాంస్య) పతకాలు సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ సి.భువనేశ్వరి వారిని అభినందించారు.

డాక్టరేట్ ప్రదానం


మహేష్ నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ పరిశోధకులు కె.మహేష్ నాయుడు డాక్టరేట్ పొందారు. ఇంపాక్ట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ ఫర్ ఎఫెక్టువల్ డైగ్నోసిస్ ఆఫ్ మెల్నోమా యూజింగ్ డీప్ మల్టీలెవెల్ ఫీచర్ ఫ్యూజ్డ్ ఎక్స్పెన్షన్ అండ్ అస్సోర్టెడ్ అటెన్షన్ అప్రోచ్ అంశంపై ప్రొఫెసర్ పద్మావతమ్మ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ రాజమాణిక్యం తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటన


కొర్లగుంటలో పర్యటిస్తున్న బాలసుబ్రహ్మణ్యం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలతో నగరంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో గురువారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం పర్యటించారు. రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, రాష్ట్ర నాయకులు కృష్ణయాదవ్, మధు, విజయలక్ష్మి, విశ్వనాథ్, రాజారాం, జగన్నాథంతో కలసి కొర్లగుంట, మారుతీనగర్, సంజయ్‌గాంధీ కాలనీ, చంద్రశేఖరరెడ్డి కాలనీ, శివజ్యోతినగర్‌లను సందర్శించారు. అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారులతో మాట్లాడి కొన్నింటిని పరిష్కరించారు. వారి నుంచి వినతులు స్వీకరించారు. కొర్లగుంట మున్సిపల్ పాఠశాల పక్కనే ప్రవహిస్తున్న మురికి కాలువపై స్లాబ్ నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఆ మాటలకు కట్టుబడి ఉన్నా : భూమన

తిరుపతి(జీవకోన), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్వీ గోశాలలో గోవులు అధికంగా మరణిస్తున్నాయని చెప్పిన మాటలకు తాను కట్టుబడి ఉన్నానని టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో విచారణకు పిలిపించారని, డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు ఎంతో హుందాగా వ్యవహరించారన్నారు. కాంట్రాక్టర్ల విషయాలపై, బిల్లుల చెల్లింపుపై ఛైర్మన్‌కు, అతని భౌ భౌకు ఏం పనంటూ ప్రశ్నించారు.

పాఠశాలల్లో నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

తిరుపతి కలెక్టరేట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నుంచి ఈనెల 30వ తేది వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు గ్రామ వార్డు సచివాలయాల అధికారి జీవీ నారాయణరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 136 పాఠశాలలో 48743 మంది పిల్లల బయోమెట్రిక్‌ను ఆధార్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉందన్నారు.

మూలస్థాన ఎల్లమ్మ గుడికి రూ.2.50 కోట్ల టీటీడీ నిధులు

● ఎమ్మెల్యే నాని అభ్యర్థనతో అనుమతించిన ప్రభుత్వం

తిరుపతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచీ రూ.2.50 కోట్లు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఆ మేరకు గురువారం దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. మూలస్థాన ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని టీటీడీని కోరారు. దీంతో మే 20న జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ మొత్తాన్ని కేటాయిస్తూ చేసిన తీర్మానాన్ని ఆమోదించారు. నిధుల విడుదలకు అనుమతి కోరుతూ టీటీడీ ఈవో రాసిన లేఖకు స్పందించిన ప్రభుత్వం తాజాగా అనుమతి జారీ చేసింది. టీటీడీ శ్రీవాణి ట్రస్టు నుంచి విడుదల చేస్తున్న ఈ నిధులతో ఎల్లమ్మ ఆలయానికి ప్రాకారం, ఆలయం లోపల రాతి ఫ్లోరింగ్, స్టోర్ రూమ్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇటీవల ఎమ్మెల్యే అభ్యర్థనపై తలకోన సిద్ధేశ్వరాలయానికి కూడా టీటీడీ భారీగా నిధులిచ్చిన సంగతి తెలిసిందే.

ప్రత్యేక రాయలసీమ కోసం ఉద్యమిద్దాం

● కుంచం వెంకటసుబ్బారెడ్డి పిలుపు

తిరుపతి, (ఎంఆర్‌పల్లె), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాయలసీమ ఏర్పాటుకు ఉద్యమిద్దామని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాలకు ప్రజలు మద్దతివ్వాలని కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ప్రత్యేక రాయలసీమ సాధనకు రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాయలసీమ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించిన పాలకులకు ఇక్కడి అభివృద్ధిపై మక్కువ లేదన్నారు. పార్టీలకతీతంగా రాయలసీమ ప్రాంత అభివృద్ధికోసం పార్టీలకతీతంగా కలిసొచ్చే వారిని కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. లేదంటే నిరవధిక పోరాటాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం దిగొచ్చేలా నవంబరు 16వ తేదీన కర్నూలులోని అంబేడ్కర్ భవన్ వేదికగా సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సాదర్ వలీ, మిట్టా కృష్ణ, ఖాసి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

దారి సమస్య పరిష్కరించాలి

తిరుపతి, (ఎమ్మార్‌పల్లె), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దారి సమస్య పరిష్కరించాలని నగర పరిధిలోని సత్యానారాయణపురానికి చెందిన మరాఠీ ప్రభాకర్ కోరారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులు, స్థలవిక్రేత మునిలక్ష్మితో కలిసి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ నగర పరిధిలోని సర్వేనెంబర్ 11/1లో గల 18 అంకణాల స్థలాన్ని మునిలక్ష్మి నుంచి కొనుగోలు చేశామన్నారు. అందులో ఇల్లు నిర్మించుకుని 18 సంవత్సరాలుగా కాపురం ఉంటున్నామన్నారు. ఇంటి పక్కనున్న స్థలాన్ని మునిలక్ష్మి ఇటీవల తమకు విక్రయించారని, ప్రస్తుతం ఆ ఇంట్లో నివాసం ఉండే శాంతిరెడ్డి, అతని కుమారుడు చరణ్, అనూష, విజయ దాన్ని ఆక్రమించారని, ప్రశ్నిస్తే భౌతిక దాడులకు దిగుతున్నారని తెలిపారు. ప్రస్తుతం తమ ఇంటికి దారి లేకుండా పోయిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు.



ప్రసూతి ఆస్పత్రి వెనుక బయో వ్యర్థాలు

ఆస్పత్రి వ్యర్థాలతో పెనుముప్పు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రోగుల పరీక్షల, శస్త్ర చికిత్సల సమయంలో ఉపయోగించిన బయో వ్యర్థాలు వారం రోజులుగా స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వెనుక మగ్గుతున్నాయి. తాజా వర్షాలకు ఇవి తడిసి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కలు ఆ వ్యర్థాలను రోడ్లపైకి తీసుకువచ్చి పడేస్తున్నాయి. ఇవి ఇలాగే ఉంటే ఆస్పత్రిలో చికిత్స పొందే గర్భిణులు, బాలింతలు, పసికందులు వ్యాధుల బారినపడే అవకాశముంది.

తిరుపతి పరిసర ప్రాంతాల్లో స్టేషన్లు అభివృద్ధి చేయండి


అమృత్ సంవాదం సభలో మాట్లాడుతున్న సీసీఎం సత్యనారాయణ

తిరుపతి (సెంట్రల్), అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి రోజురోజుకూ పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని సమీపంలోని తిరుచానూరు, తిరుపతి వెస్ట్, రేణిగుంట, చంద్రగిరి రైల్వేస్టేషన్లను టెర్మినల్స్‌గా అభివృద్ధి చేయాలని పలువురు కోరారు. తిరుపతిని రైల్వే డివిజన్ చేయాలన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లోని వీఐపీ ఛాంబర్‌లో గురువారం అమృత్ సంవాద్ నిర్వహించారు. తిరుపతిలోని పలు ప్రజా సంఘాల నాయకులు హాజరై మాట్లాడుతూ తిరుపతి రైల్వేస్టేషన్‌ను రూ.300 కోట్లతో అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కాణిపాకం, శ్రీకాళహస్తి, తిరుత్తణి మధ్య సబ్ అర్బన్ రైళ్లను నడపాలని కోరారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సాధారణ, సెకండ్ స్లీపర్ క్లాస్ కోచ్‌లు పెంచాలని కోరారు. రైళ్లలో టాయిలెట్‌లు శుభ్రంగా ఉంచాలని సంఘాల నాయకులు బుజ్జిబాబు, హర్షవర్ధన్‌రెడ్డి, ఎం.మునీశ్వర్‌రెడ్డి, జయపాల్, పి.మురళి, ఆలిండియా బ్రాహ్మణ మహాసభ చారిటబుల్ ట్రస్ట్ నాయకులు అనిల్ గౌర్, రాజారెడ్డి కోరారు. అన్ని విషయాలను రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళతామని చీఫ్ కమర్షియల్ మేనేజరు సత్యానారాయణ చెప్పారు. ఈ సభలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, సీసీఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రష్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిపాయి సుబ్రహ్మణ్యం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రష్ ఆస్పత్రిలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం భార్య శాంతి సుబ్రహ్మణ్యం 12వ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో పలువురు రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు ఆమె చిత్రపటానికి కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆస్పత్రిలో అన్నదానం చేశారు. డాక్టర్ సిపాయి కీర్తిసాగర్, డాక్టర్ సిపాయి మౌనారెడ్డి, పెరుమాళ్‌రెడ్డి, రత్నం రెడ్డి, డాక్టర్ బాబు, సిబ్బంది రోజా, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై విస్తృత పరిశోధనలు

● వ్యవసాయ వర్సిటీ వీసీ శారద జయలక్ష్మి వెల్లడి


మాట్లాడుతున్న వీసీ శారద జయలక్ష్మి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల పెంపకంపై విస్తృత పరిశోధనలు చేపట్టనున్నట్టు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ శారద జయలక్ష్మి పేర్కొన్నారు. ఎస్వీ వ్యవసాయ కాలేజీలోని స్వర్ణముఖి అతిథి గృహంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎస్వీ వ్యవసాయ కళాశాలలోని పుట్టగొడుగుల పరిశోధన కేంద్రం ద్వారా రైతులకు, యువకులకు, గ్రామీణ మహిళలకు శిక్షణతో పాటు సూచనలు అందిస్తున్నట్లు చెప్పారు. పుట్టగొడుగులలో మంచి ప్రొటీన్ ఉంటుందన్నారు. మన రాష్ట్రం పుట్టగొడుగుల పెంపకానికి అనుకూలమన్నారు. యువత ఈ రంగంలో స్వయం ఉపాధి పొందడంతో పాటు వ్యాపారంగా నిర్వహించడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ పుట్టగొడుగుల పరిశోధన కేంద్రంలో విత్తన ఉత్పత్తికి గల అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. తక్కువ విస్తీర్ణంలో, తక్కువ పెట్టుబడితో వ్యవసాయ వ్యర్థాలను వినియోగించుకొని పుట్టగొడుగుల పెంపకం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ వీపీ శర్మ తెలిపారు. పుట్టగొడుగులలోని పోషక విలువ మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తాయన్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.రెడ్డిశేఖర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకురాలు డాక్టర్ వి.సుమతి, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పరిశోధన సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది భార్య, కుమారుడిపై దాడి

తిరుచానూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, అనుచరులపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన న్యాయవాది భార్య, కుమారుడిపై దాడి చేసిన ఘటనలో తిరుచానూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శంకరానందరెడ్డితో పాటు అతని అనుచరులపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు... తిరుపతికి చెందిన న్యాయవాది భార్య నిడుమూరు అన్నపూర్ణ, ఆమె కుమారులు ఆదిత్య భరద్వాజ, కృష్ణచైతన్య కలసి కారులో మంగళవారం రామాపురంలోని వారి ప్లాట్ చూసుకుని తిరిగి తిరుపతికి వస్తున్నారు. ఆ సమయంలో శంకరానందరెడ్డి కారులో సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్డుపై నిదానంగా వెళుతున్నారు. హారన్ కొట్టినా సైడ్ ఇవ్వలేదు. 'కారు సైడ్‌లో పార్కు చేసి మాట్లాడుకోవచ్చు కదా' అని న్యాయవాది భార్యాబిడ్డలు చెప్పారు. ఆగ్రహానికి గురైన శంకరానందరెడ్డి తన అనుచరులు ఢిల్లీనాథరెడ్డి, అశోక్, మహేష్, విజయ్, హరీష్‌లకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వారు దుర్గసముద్రం ఆర్చ్ సమీపంలో కారును ఆపి అన్నపూర్ణ, ఆమె కుమారుడు ఆదిత్య భరద్వాజ్‌ను జుట్టుపట్టుకుని కిందకు దింపి, తీవ్రంగా కొట్టి గాయపరిచారు. అన్నపూర్ణను అసభ్యకరంగా మాట్లాడారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే కారును ధ్వంసం చేస్తామని బెదిరించారు. శంకరానంద రెడ్డి కృష్ణచైతన్య మెడలోని 20 గ్రాముల బంగారు చైన్‌ను లాక్కొని వెళ్లిపోయారు. బుధవారం వారి బంధువుల అంత్యక్రియలు ముగించుకుని వచ్చిన అన్నపూర్ణ ఆమె కుమారులు గురువారం తిరుపతి రూరల్ సీఐకి ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి సేవలో కేంద్రమంత్రి



తిరుచానూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ తిరుచానూరు పద్మావతి అమ్మవారిని గురువారం రాత్రి దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు ఆమెకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. మంత్రి అమ్మవారిని దర్శించుకుని, మొక్కు లు చెల్లించుకున్నారు. వేద పండితులు ఆమెను ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఐసీడీఎస్ పీడీ వసంత బాయి పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఓట్ చోరీపై 21 వేల సంతకాల సేకరణ


సేకరించిన సంతకాలను షర్మిలకు అందిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, ఓట్ చోరీపై తిరుపతి నియోజకవర్గ ప్రజల నుంచి 21 వేల సంతకాలు సేకరించామని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు తెలిపారు. సేకరించిన సంతకాలను తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు బాలగురవం బాబు, రాయలసీమ ఇన్‌చార్జి మస్తాన్‌వల్లి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి సుధాకర్‌రెడ్డితో కలిసి గురువారం విజయవాడలోని పీసీసీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు అందజేశారు. ప్రజలను చైతన్యవంతం చేసి, పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె ఆదేశించారు. అనంతరం తిరుపతిలోని రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతానికి చేస్తున్న కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకటనరసింహులు, సీనియర్ నేతలు శివశంకర్, సాల్మన్‌రాజు, దామోదరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ.మూడు లక్షల జరిమానా


నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.మూడు లక్షల జరిమానా విధిస్తూ గురువారం ఎర్రచందనం ప్రత్యేక కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. ఎర్రచందనం కోర్టు అసిస్టెంట్ లైజన్ అధికారి అత్తిరాళ్ల ఖ్యాతి తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా బాలప్పనూరుకు చెందిన కుప్పుస్వామి విజయకుమార్, తిరువణ్ణామలై జిల్లా క్రొత్తటూరు గ్రామానికి చెందిన విజయకుమార్ రామరాజులు స్నేహితులు. సులభంగా డబ్బు సంపాదనకు ఆశ పడి ఎర్రచందనం కూలీలుగా మారారు. అనంతరం స్మగ్లర్లుగా మారి.. శేషాచలంలో ఎర్రచందనం వృక్షాలు నరికి మధ్యవర్తుల ద్వారా విక్రయించేవారు. 2018లో పీలేరు రేంజ్ పరిధిలోని యలమంద సమీపంలోని మేలచెరువు నుంచి ఆరు ఎర్రచందనం దుంగలు వాహనంలో తరలించడానికి సిద్ధంగా ఉంచారు. ఈ విషయం తెలిసి అప్పటి ఎఫ్‌బీవో సవ్వ సుల్తాన్ వారిని వెంబడించి పట్టుకున్నారు. దుంగలు సీజ్ చేశారు. వీరిద్దరినీ అరెస్టు చేశారు. కొంత కాలం పాటు రిమాండ్‌లో ఉన్న వీరిద్దరూ.. తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. వాయిదాలకు హాజరవుతూ వచ్చారు. ఈ క్రమంలో తిరుపతిలోని రాష్ట్ర ఎర్రచందనం కోర్టుకు కేసును బదలాయించారు. ఏపీపీ అమరనారాయణ, , కోర్టు కానిస్టేబుల్ చంద్రకళ, లైజన్ అధికారి ఖ్యాతి సాక్ష్యాదారాలను న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు.

తెలుగు క్రికెటర్లకు సహకారం అందిస్తా

చాముండేశ్వరనాథ్



తిరుమల, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణకు చెందిన తెలుగు క్రికెటర్లను పైకి తీసుకొచ్చేలా చూస్తానని బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు, మాజీ రంజీ క్రికెటర్ చాముండేశ్వరనాథ్ తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తాను బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో ఉంటే తెలుగు క్రికెటర్లకు వీలైనంత సహాయం చేయొచ్చన్నారు. ఇక, పాకిస్తాన్ ఆడినా ఆడకపోయినా ఆసియా కప్ టోర్నమెంట్ జరుగుతుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. వరల్డ్‌కప్, ఆసియా కప్ వంటివి పాకిస్తాన్‌తో వేరే దేశాల్లో ఆడతామని, ఇండియాలో మాత్రం ఆడబోమని బీసీసీఐ కూడా నిర్ణయం తీసుకుందన్నారు. అలాగే ఫ్రెండ్లీ సిరీస్ కూడా పాకిస్తాన్‌తో ఆడబోమని బోర్డు స్పష్టం చేసిందన్నారు. ఆసియా ట్రోఫీ పాకిస్తాన్‌కు తీసుకెళ్లినందుకు మన క్రికెటర్లు బీసీసీఐకి ఫిర్యాదు చేశారని, ఈ విషయంలో బోర్డు త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందన్నారు.


జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్యను గురువారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

గణిత సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో డిసెంబరులో గణిత జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ బ్రోచర్‌ను వీసీ నరసింగ రావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆవిష్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఓవీఎస్ రెడ్డి, మ్యాథ్స్ హెడ్ జయసుబ్బారెడ్డి, అధ్యాపకులు సుధాకరయ్య, భారతి పాల్గొన్నారు.

వేడుకగా స్వచ్ఛోత్సవ్


విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అధికారులు

తిరుపతి (విశ్వవిద్యా లయాలు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో మహిళలు నాయకత్వ పాత్ర పోషించాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్ చంద్ర కోరారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం - సీబీసీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛోత్సవ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శానిటేషన్ కార్యక్రమాలు మరింత ఫలప్రదంగా సాగాలన్నారు. సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో, ఘన వ్యర్థాల ఆర్థిక వ్యవస్థలో మహిళలకు అవకాశాలు లభించనున్నట్టు తెలిపారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఐ.వి.లలితకుమారి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో స్వచ్ఛత ప్రమాణాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజల్లో అవగాహన పెంచడంలో ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు.


ఆలయం ముందు తేజ సజ్జా, కార్తీక్ ఘట్టమనేని

స్వామికి థ్యాంక్స్ చెప్పడానికి వచ్చాం

● 'మిరాయ్' హీరో తేజ సజ్జా

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): 'మిరాయ్' చిత్రం విజయాన్ని సాధించిన నేపథ్యంలో స్వామికి థ్యాంక్స్ చెప్పుకునేందుకు వచ్చామని ఆ చిత్ర హీరో తేజ సజ్జా తెలిపారు. చిత్ర దర్శకుడు కార్తీక్ ఘట్టమనేనితో కలిసి ఆయన గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తన చిన్నతనం నుంచి స్వామి దర్శనానికి వస్తున్నానని, ఈసారి స్వామివారే పిలిపించుకున్నారనే విధంగా అద్భుతమైన దర్శనం లభించిందన్నారు. ఇంకా పెద్ద ఆలోచనలు ఉన్నాయని, రాబోయే సినిమాల గురించి త్వరలో ప్రకటిస్తానని తెలిపారు. ప్రతి సినిమా విడుదల, అనంతరం తిరుమలకు రావడం తనకు ఆనవాయితీ అని దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని చెప్పారు. అంతకుముందు కార్తీక్ శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

అప్పటికి ఇప్పటికి తిరుమలలో ఎంతో వ్యత్యాసం

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): గతానికి, ప్రస్తుతానికి తిరుమలలో ఎంతో వ్యత్యాసం కనిపిస్తోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. దర్శనం, వసతి, ప్రసాదాల్లో పూర్వవైభవం కనిపించడంతో పాటు ఈ ప్రాంతాన్ని మరింత పవిత్రంగా ఉంచాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గతంలో జరిగిన నష్టాన్ని పరిష్కరించుకుంటూ శ్రీవారి సేవలు, దర్శనం అందుబాటులో ఉండేలా చేయగలిగే సమర్థతను చూస్తున్నామన్నారు.


ఆలపాటి రాజేంద్రప్రసాద్

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.47కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,853

తలనీలాలు సమర్పించినవారు: 22,551




చిగురువాడ వద్ద స్వర్ణముఖిలోకి వదులుతున్న డ్రైనేజీ నీరు

స్వర్ణముఖిలోకి వ్యర్థ నీరు


డ్రైనేజీ వ్యర్థాలను నదిలోకి మళ్లించేందుకు తీసిన గోతులు

● గుట్టుచప్పుడు కాకుండా వదులుతున్న వైనం ● పట్టించుకోని పంచాయతీ పాలకులు

తిరుపతిరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని పలు గ్రామాలు నగరానికి చేరువగా ఉండటంతో పదుల సంఖ్యలో సంస్థలు, అపార్ట్‌మెంట్లు వెలుస్తున్నాయి. విద్యాసంస్థలకు అనుబంధంగా వసతిగృహాలను కూడా నిర్వహిస్తున్నారు. భవన యజమానులు(బిల్డర్లు) తుడా అనుమతితో పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు నిర్మించి విక్రయిస్తున్నారు. అయితే వీటినుంచి వెలువడే డ్రైనేజీ, టాయిలెట్ వ్యర్థాల నిర్వహణకు ఆ ప్రాంగణాల్లో సోర్డేజీ సెప్టిక్‌ట్యాంక్‌లను ఏర్పాటు చేయలేదు. దీంతో గుట్టుచప్పుడు కాకుండా స్వర్ణముఖి నదిలోకి మళ్లిస్తున్నారు. నదిలోని నీరు కలుషితమై, వీటిని తాగి పశువులు, జీవాలు మృత్యువాతపడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నదిలో తాగునీరు బోర్లను ఏర్పాటు చేసుకుని పైప్‌లైన్ల ద్వారా వినియోగించుకుంటున్నారు. ఈ బోర్లకు సమీపంలో మురుగు, వ్యర్థాలను వదులుతుండడంతో తాగునీరు కలుషితమై వ్యాధులు వచ్చే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ పాలకులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా తమకేమీ పట్టనట్లు మిన్నకుండిపోతున్నారని వాపోతున్నారు. ఆర్సీపురానికి వెళ్లే మార్గంలో కేసీపేట, దుర్గసముద్రం, చిగురువాడ, వేదాంతపురం గ్రామాల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు అనుబంధంగా నడుస్తున్న వసతిగృహాల్లో వేలాది మంది విద్యార్థులు ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీ నీరు బయటకు వదులుతుండటం విమర్శలకు తావిస్తోంది.

పలు పంచాయతీల్లో ఇలా: దుర్గసముద్రంలో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ విద్యాసంస్థకు చెందిన డ్రైనేజీ నీటిని వదిలేందుకు రెండు కిలోమీటర్లకు పైగా గ్రామ సిమెంటు రోడ్డును ఛిద్రంచేసి నది వరకూ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. చిగురువాడ ముఖద్వారంలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ విద్యాసంస్థకు చెందిన డ్రైనేజీ, వ్యర్థాలను సమీపంలోని కాలువమీదుగా నదిలోకి వదులుతున్నారు. ఇదేపంచాయతీలోని వైఎస్సార్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ నిర్వాహకులు డ్రైనేజీ వ్యర్థాలను నదిలోకి మళ్లించేందుకు ఇటీవల గోతులు తీశారు. గ్రామస్తులు అడ్డుకోవడంతో పనులను నిలుపుదల చేశారని తెలిసింది. కేసీపేటలోని విద్యాసంస్థకు చెందిన డ్రైనేజీ వ్యర్థాలను సమీపంలోని స్వర్ణముఖిలోకి మళ్లించారని తెలిసింది.


జస్టిస్ శ్యాంప్రసాద్ - జస్టిస్ అరుణ్‌కుమార్ - జస్టిస్ వైశాలి పటేల్

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్యాంప్రసాద్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైశాలి పటేల్, జార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్‌కుమార్ ఉన్నారు.

రేపే ఆఖరు

జాతీయ ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తుది గడువు శనివారమే. ఈ రెండు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, ప్రతిభావంతులైన విద్యార్థులు జాతీయ ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్ఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోండి. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఇప్పటివరకు జిల్లాలో 2,923 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

180 మార్కులకు ప్రశ్నపత్రం



ప్రతిభా పరీక్ష డిసెంబరు నెలలో నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించే తేదీన మూడు గంటల పాటు పరీక్ష జరుగుతుంది. మొత్తం 180 మార్కులకు రెండు విభాగాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది. మెంటల్ ఎబిలిటీకి 90 మార్కులు, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలకు సంబంధించి 90 మార్కులకు మల్టిపుల్ చాయిస్ రూపంలో ప్రశ్నపత్రం ఉంటుంది.

- కె.వి.ఎన్.కుమార్, డీఈవో

అర్హులు ఎవరంటే?

ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. ఓసీ, బీసీ విద్యార్థులు 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. అలాగే వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల్లోపు ఉండాలి. విద్యార్థులు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ. 50లు పరీక్ష రుసుం చెల్లించాలి.


నిండుకుండలా పాకాల పెద్దచెరువు

చెరువులకు జలకళ

పాకాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలోని కుంటలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. కోనేటి చెరువు, కుళ్లప్పరెడ్డిచెరువు, నాయనిచెరువు,కళ్యాణరామన్నచెరువు, దేశిరెడ్డివానిచెరువు, రామసముద్రం చెరువు, పాపిరెడ్డిచెరువు, మొగరాల చెరువు, అమ్మచెరువు, పదిపట్లబైలు రిజర్వాయర్, పాకాల పెద్దచెరువు, మల్లేశ్వరస్వామివారిచెరువు, వెంకట్రాయనిచెరువు, కళ్యాణరామన్న చెరువులు నిండాయి. సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదని మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేబుల్ వైరు చోరీ

పాకాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాకాల పంచాయతీ శివశక్తినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్ వైరు చోరీ చేశారు. బుధవారం రాత్రి కిటికీ గ్రిల్స్ వంచి బోరు మోటారుకు, ఇంటి లోపల అమర్చి ఉన్న వైర్లు తీసుకెళ్లిపోయారు. ఇంటి యజమాని పి.మోహన్ పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోతకు గురైన నాగయ్యగారిపల్లె స్వర్ణముఖి కల్వర్టు



కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహన్ - కల్వర్టుపై ఏర్పాటు చేసిన బోర్డు

చంద్రగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యగారిపల్లె వద్దవున్న స్వర్ణముఖి నది కల్వర్టు కోతకు గురైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గతంలో కురిసిన వర్షాలకు నాగయ్యగారిపల్లె వద్ద పైపులతో తాత్కాలికంగా కల్వర్టు నిర్మించారు. ప్రస్తుతం కోతకు గురైంది. గురువారం తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య పరిశీలించారు. కల్వర్టుపై ప్రయాణించరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కళ్యాణి డ్యామ్‌లో పెరుగుతున్న నీటిమట్టం

● శేషాచలం అడవి నుంచి భారీగా చేరుతున్న వరద నీరు

చంద్రగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యాణి డ్యామ్‌లో నీటిమట్టం పెరుగుతోంది. తుఫాన్ కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి శేషాచలం అడవి నుంచి వరద నీరు డ్యామ్‌లోకి చేరుతోంది. తుఫాన్‌కు ముందు డ్యామ్‌లో 836 అడుగులు ఉండగా బుధవారం రాత్రికి 851 అడుగులకు చేరింది. గురువారం సాయంత్రానికి 856 అడుగులకు చేరిందని డ్యామ్ అధికారులు తెలిపారు. శేషాచలం అడవుల్లోని రాగిమానుకోన, అనుమకోన, అబ్బాలమేరు, చీకుమానుకోన, గుండాలపెంట వాగుల నుంచి వరద నీరు డ్యామ్‌లోకి వస్తోంది.

● ముక్కంటి ధర్మకర్తల మండలిలో

నేడు కొందరు సభ్యుల ప్రమాణం

శ్రీకాళహస్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలిలో టీడీపీ తరపున నియమితులైన సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మండలిలో తొలిసారిగా వివిధ నియోజకవర్గాల నుంచి సభ్యులను ఎంపిక చేశారు. దీంతో సభ్యులు ఎవరికి వారు తమకు అనువైన ముహూర్తాలను ఖరారు చేసుకున్నారు. దీంతో టీడీపీ నుంచి నియమితులైన గుర్రప్ప శెట్టి, గాది పాకుల గోపినాథ్, లక్ష్మి శుక్రవారం సాయంత్రం ముక్కంటి ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ గురువారం తెలిపారు.

ఉధృతంగా తలకోన ఏరు ప్రవాహం


జలపాత సోయగం - జోరుగా ప్రవహిస్తున్న తలకోన ఏరు

● కోటకాడపల్లెకు తెగిన సంబంధాలు

ఎర్రావారిపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శేషాచల కొండల్లో కురుస్తున్న భారీ వర్షానికి తలకోన ఏరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తలకోన అడవుల నుంచి వలసపల్లె మీదుగా వెళ్లే తలకోన ఏరు కోటకాడపల్లె రోడ్డు వద్ద జోరుగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కోటకాడపల్లె పంచాయతీలోని వీర్‌కాలనీ, వేములవాడ, తడికినుచేనుపల్లె, అయ్యగారిపల్లె, బోయపల్లె, ఓఎస్ గొల్లపల్లె, చెంగాడవాండ్లపల్లె, అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం దిన్నెల గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఎంపీడీవో మదన్‌మోహన్‌రాజు అధికారులతో కలిసి తలకోన ఏరు వద్దకు వెళ్లి పరిస్థితిని అంచనా వేశారు. ప్రవాహం ప్రమాద కరంగా ఉండటంతో రాకపోకలకు అనుమతించలేదు. తలకోన పర్యాటక ప్రాంతానికి పర్యాటకుల రాకపోకలను నిషేధించారు. ఎస్సై బాలకృష్ణయ్య మండలంలో పర్యటించి, ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షానికి కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది.

రెగ్యులర్.. కాదు ఎఫ్ఏసీ

● 24 గంటల్లో భిన్న ఉత్తర్వులు

● గందరగోళంలో స్కిట్ ప్రిన్సిపాల్ నియామకం

కలికిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని స్కిట్ కళాశాల అనంతపురం జేఎన్టీయూ వర్సిటీలో విలీనమైంది. ఇక నుంచి ఈ కళాశాలను జేఎన్టీయూ-స్కిట్ పేరుతో వ్యవహరించాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రిన్సిపాల్ నియామకంపై 24 గంటల్లో భిన్న ఉత్తర్వులు జారీ కావడంతో గందరగోళం నెలకొంది. తొలుత కలికిరి జేఎన్టీయూ కళాశాల ప్రస్తుత ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావును స్కిట్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ బుధవారం రాత్రి జేఎన్టీయూ రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణం రిలీవ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన స్థానంలో కలికిరి కళాశాలలోనే ఈసీఈ విభాగాధిపతి ఆర్.రమణారెడ్డిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ మరో ఉత్తర్వును జారీ చేశారు. గురువారం ఉదయానికల్లా.. బుధవారం నాటి ఉత్తర్వును సవరిస్తూ మరో ఉత్తర్వు వచ్చింది. కలికిరి ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావును స్కిట్ ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తున్నట్లు.. ముందు రోజు ప్రిన్సిపాల్‌గా నియమించిన ప్రొఫెసర్ రమణారెడ్డిని కలికిరి కళాశాలకు వైస్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న కె.త్యాగరాజన్‌ను తొలగించి ఫిజిక్స్ విభాగాధిపతిగా పరిమితం చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. కాగా, కలికిరి కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పూర్తి బాధ్యతలతో పనిచేసే వెంకటేశ్వరరావు ఇక్కడి నుంచి 120 కి.మీ. దూరంలోని స్కిట్ కళాశాలలో అదనపు బాధ్యతలను ఎలా నిర్వహిస్తారు? ఈ నియామకాల్లో గందరగోళం వెనుక కారణాలేంటనేది చర్చనీయాంశమైంది.

రాయలచెరువును పరిశీలించిన ఎమ్మెల్యే నాని


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

రామచంద్రాపురం, అక్టోరు 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని రాయలచెరువును ఎమ్మెల్యే నాని గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువు కట్టతోపాటు మొరవను పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చెరువులో 40 శాతం మాత్రమే నీరు చేరినందున ఎలాంటి ఇబ్బందులూ లేవని ఇరిగేషన్ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. చిట్టత్తూరు, కాళేపల్లె రైతులు తమ పంట నీట మునిగిందని, ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రతి రైతునూ ఆదుకోంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, సింగిల్‌విండో చైర్మన్ జనార్దన్‌చౌదరి, నాయకులు నరసింహారెడ్డి, హరిప్రసాద్, ఉమాపతినాయుడు, సురేంద్రనాయుడు, త్యాగరాజులు, తహసీల్దార్ మధుసుదన్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎస్ఐ భక్తవత్సలం పాల్గొన్నారు.

105 మందికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు


క్యాన్సర్ పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పాకాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు మ్యాంగోనగర్ ఆర్ఆర్ కల్యాణ మండపంలో గురువారం పింక్ బస్సు ద్వారా 105 మందికి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి, లయన్స్ క్లబ్ దామలచెరువు మ్యాంగోనగర్ సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. హాజరైన మహిళలు, పురుషులకు క్యాన్సర్ వ్యాధి లక్షణాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిబాషా, రీజనల్ చైర్‌పర్సన్ రామయ్య, స్విమ్స్ వైద్యులు డాక్టర్ పద్మావతి, పీఆర్వో చంద్రమోహన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నాగూర్ బాషా, నాగూర్, నిజాముద్దీన్, కేఎస్ మస్తాన్, ఇమ్రాన్, మాధవి, అన్సర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహప్రతిష్ఠ


పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

రామచంద్రాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మకండ్రిగ ఆదిఆంధ్రవాడలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఉదయం వైభవంగా జరిగింది. నూతనంగా నిర్మించిన ఆలయంలో మంగళవారం నుంచి వివిధ హోమాలు, పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం 10 గంటలకు పూర్ణాహుతితో కుంభాభిషేకం ముగిసింది. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు మేళ తాళాల నడుమ జరిగింది. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త లంబోధరనాయుడు, దాతలు, సర్పంచ్ కాకర్ల కావ్య, వేణుగోపాల్‌నాయుడు దంపతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉద్యోగి మృతి


నరేష్ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ రిజిస్ట్రార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ నరేష్ అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నేండ్రగుంటలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నరేష్ మృతికి సంతాప సూచకంగా యూనివర్సిటీ పరిపాలనా భవనంతోపాటు ఇతర ముఖ్య విభాగాలకు గురువారం సెలవు ప్రకటించారు.

రాఘవులు నాయుడికి నివాళి


రాఘవులు నాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఎకనమిక్స్ విభాగ రిటైర్డు ప్రొఫెసర్ రాఘవులు నాయుడికి ఎకనమిక్స్ విభాగం ఘన నివాళి అర్పించింది. రాఘవుల నాయుడు కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. ఎకనమిక్స్ విభాగంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. ఎకనామిక్స్ విభాగాధిపతి కె.రాధిక, బీవోఎస్ చైర్‌పర్సన్ ఆర్.సునీత మాట్లాడుతూ రాఘవుల నాయుడు ఎకనమిక్స్ విభాగ అభివృద్ధికి చేసిన కృషి అభినందనయమని పేర్కొన్నారు. అనేకమంది పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీలు అందించడంలో ఆయన కీలక పాత్ర వహించారని తెలిపారు. హెచ్‌వోడీగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్స్ సుబ్రహ్మణ్యం, ప్రతాప్, గీతా కుమారి, రమేష్, పరిశోధక విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కఠారి దంపతుల హత్యకేసులో నేడు తుది తీర్పు

● పదేళ్ల విచారణ తరువాత వెలువడనున్న జడ్జిమెంట్

● 21మంది నిందితులు, 122మంది సాక్షుల విచారణ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పదేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అప్పటి చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త మోహన్ హత్య కేసుకు సంబంధించి శుక్రవారం తుదితీర్పు వెలువడనుంది. పదేళ్ల సుదీర్ఘ విచారణ తరువాత జిల్లా కేంద్రంలో ఉన్న ప్రత్యేక మహిళా న్యాయస్థానం ఈ కేసుకు సంబంధించిన తీర్పును వెలువరించనుంది. 2015 నవంబరు 17వ తేదీన ఉదయం చిత్తూరు నగర పాలక కార్యాలయం తుపాకుల కాల్పులతో, కత్తిపోట్లతో హోరెత్తింది.చిత్తూరు కార్పొరేషన్ తొలి మేయర్ అనురాధతో పాటు మున్సిపల్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడైన ఆమె భర్త కఠారి మోహన్ వారి ఛాంబర్లలో ఉన్నారు.ఇంతలో బురఖా ధరించిన కొంతమంది కత్తులు, తుపాకులతో కార్యాలయంలోకి వచ్చారు. మేయర్ అనురాధను ఆమె ఛాంబర్‌లో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకీతో కాల్చడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయారు.కాల్పుల శబ్దం విని వచ్చిన ఆమె భర్త కఠారి మోహన్ అక్కడి దృశ్యం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే దుండగులు కత్తులతో అతడి వెంటపడ్డారు.ప్రాణభయంతో కౌన్సిల్ హాలు గుండా పరుగెత్తగా కత్తులతో పొడిచి పారిపోయారు.తీవ్రగాయాలతో రక్తమోడుతున్న మోహన్‌ను వెంటనే వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించగా అదేరోజు సాయంత్రం ఆయన కూడా మృతి చెందారు.మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కఠారి మోహన్ మేనల్లుడు చింటూను ప్రధాన నిందితుడిగా చూపించిన పోలీసులు..ఈ జంట హత్యలకు సంబంధముందని 23 మందిని అరెస్టు చేశారు.వీరిలో శ్రీకాళహస్తికి చెందిన కాసరం రమేష్ అనే వ్యక్తికి హత్యలతో సంబంధం లేదని గతంలోనే న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. మరో నిందితుడు శ్రీనివాసాచారి కేసు విచారణలో ఉండగానే అనారోగ్యంతో మృతి చెందాడు. మిగిలిన 21మందిలో చింటూ ప్రధాన నిందితుడు కాగా వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేశ్, మురుగన్, యోగానంద్, పరంధామ, దాసు, మొగిలి, శశిధర్, యోగానందం, ఆర్వేటి బాబు, లోకేష్, రఘుపతి, నాగరాజు, ఆనంద్‌కుమార్, కమలాకర్, రజనీకాంత్, నరేంద్రబాబు, సురేష్ పేర్లను పోలీసులు ఛార్జీషీట్‌లో దాఖలు చేశారు.ఈ పదేళ్ల కాలంలో మొత్తం 122 మంది సాక్షులను విచారించిన జిల్లా జడ్జి శ్రీనివాసరావు శుక్రవారం తీర్పు వెలువరించనున్నారు.

200మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మేయర్ దంపతుల హత్య కేసుకు సంబంధించి శుక్రవారం తీర్పు వెలువడనున్న నేపథ్యంలో పోలీసుశాఖ అప్రమత్తమైంది. కోర్టు ఏ తీర్పు ఇచ్చినా..కోర్టు ఆవరణతో పాటు నగరంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలతో పాటు 179 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. వీరు కోర్టు ప్రాంగణంతో పాటు కఠారి కుటుంబం , చింటూ నివాసాలున్న గంగనపల్లె, ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తును నిర్వహించనున్నట్లు డీఎస్పీ సాయినాథ్ తెలిపారు.

కుక్కంబాకం చెరువుకు గండి




కూలిన పూరిల్లు వద్ద నిరాశ్రయులు- కోతకు గురైన చిన్నాయ్యగుంట రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు గురువారం కుక్కంబాకం పెద్ద చెరువుకు గండి పడింది. రైతులు ఎక్స్‌కవేటర్ ద్వారా పూడ్చినా ఎగువ నుంచి నీరు వస్తూనే ఉంది. చిన్నాయ్యగుంట రోడ్డుకు కోతకు గురవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టాభిగిరిజన కాలనీలో మూడు పూరి గుడిసెలు దెబ్బతిన్నాయి. ఆలత్తూరు దళితవాడలో ఓ పూరిల్లు పడిపోయింది. చెరువులు నిండుతున్నాయి. గ్రామీణ రోడ్లు దెబ్బతింటున్నాయి. పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య కోరారు.

అరణియార్ గేట్లపై అప్రమత్తం : ఆదిమూలం



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, అధికారులు

పిచ్చాటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అరణియార్ గేట్లపై గట్టి నిఘా ఉంచాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గురువారం ఉదయం ఆయన అరణియార్ స్పిల్‌వే గేట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 27.8 అడుగులకు చేరిందన్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 31 అడుగులన్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులుగా ఉందన్నారు. ప్రాజెక్టు నీటి మట్టం 29 అడుగులకు చేరుకోగానే గేట్లు పైకెత్తి అధికనీటిని బయటకు పంపుతామని, చివరిగా జలాశయంలో పూర్తి స్థాయి నీటి మట్టం 31 అడుగులు ఉండేలా చూస్తామని ఇరిగేషన్ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, ఏఈ ధరణి కుమార్, ఇళంగోవన్‌రెడ్డి, రవిరెడ్డి, రాజేంద్రన్ పాల్గొన్నారు.

ఉత్తర్వుల సవరణతో ఏదీ ప్రయోజనం: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): డీఏ ఉత్తర్వుల సవరణతో ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రయోజనం లేదని ఏపీటీఎఫ్ నాయకులు అన్నారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, నాయకులు వెంకటాద్రి, వెంకటముని పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

కల్తీ మద్యం ఫార్ములా కేరాఫ్
తాడేపల్లి ప్యాలెస్

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



పుత్తూరు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తమ అవినీతి, అక్రమాలను, పాపాలను ఎదుటి వారిపై నెట్టడంలో జగన్ అండ్ కో పీహెచ్‌డీ చేశారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఎద్దేవా చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లిక్కర్ మాఫియా నడిపి రూ.3,500 కోట్లు దోచుకున్న విషయం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠను దెబ్బతీయాలని కుట్రపూరితంగా కల్తీ మద్యం ఫార్ములాను తాడేపల్లి ప్యాలెస్‌లో తయారు చేశారని ఆరోపించారు. ఈక్రమంలోనే ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం బయటపడిందన్నారు. జోగి రమేష్, జనార్దనరావు కుట్రకు పాల్పడి కూటమి ప్రభుత్వానికి ఆపాదిచేందుకు ప్రయత్నించారన్నారు. ఆఫ్రికాలో కల్తీ వ్యాపారాల అనుభవంతో జగన్ పాలనలో ఒవిషపూరిత మద్యంతో రాష్ట్రంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.

ఈమార్గం గుంతలమయం



అధ్వానంగా ఏఎంపురం రోడ్డు

వడమాలపేట,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):తిరుపతి- చెన్నై జాతీయ రహదారి తడుకు రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి ఏఎం పురం వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు మెటల్ రోడ్డు రాళ్లు తేలిపోయింది. గుంతల్లో నీరు చేరడంతో వాహనాల రాకపోకలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని ఈరోడ్డును మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ క్వారీల రద్దు కోసం ధర్నా



పుత్తూరు,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్రమ క్వారీలను రద్దు చేయాలని, అనుమతులిచ్చిన చోట భద్రత కల్పించాలని గురువారం స్థానిక మండల రెవిన్యూ కార్యాలయం ఎదుట వామపక్షాలు ధర్నా చేశాయి. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ ఇటీవల ఓ క్వారీ వద్ద కార్మికుడు హత్యకు గురి కావడం, పేలుడు వల్ల ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడని గుర్తు చేశారు. శక్తిమంతమైన పేలుడు శబ్దాలకు చుట్టు పక్కల గ్రామాల్లోని ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయన్నారు. ఇళ్లలోని వస్తువులు పగిలి పోతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న క్వారీల మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తర్వాత డీటీ అశోక్ రెడ్డికి వారు వినతిపత్రం సమర్పించారు. వామపక్ష నాయకులు మహేష్, వెంకటేష్, భాస్కర్, రవిగోవిందు, విజయ్‌లు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి సన్నిధిని మంత్ర జలాలతో శుద్ధి చేశాక కలశ స్థాపనతో సంకల్పం నిర్వహించారు. పూజా ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అలంకరణ అనంతరం ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. భక్తులు అభిషేక పూజలను దర్శించుకున్నారు.

సింగిల్‌విండో పాలకవర్గం ప్రమాణ స్వీకారం



చైర్మన్, సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

నాగలాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నాగలాపురం సింగిల్‌విండో పాలకవర్గం సభ్యులు గురువారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా బీరకుప్పం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యంరాజు, డైరెక్టర్‌గా సుగ్రీవరెడ్డి, సభ్యులుగా రాజశేఖర్ యాదవ్‌లు ప్రమాణం చేశారు. స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, నాయకులు పార్థీబన్, తదితరులు పాల్గొన్నారు.

ఆకాశదీపం ప్రజ్వలన



శ్రీకాళహస్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ముక్కంటి ఆలయంలో గురువారం సాయంత్రం పెద్ద పండితులు ఆకాశదీపాన్ని వెలిగించారు. ఆగమ శాస్త్ర నియమానుసారం పవిత్ర కార్తీకమాసం పురస్కరించుకొని పగడ చెట్టు వద్ద అర్చకులు ఆకాశ దీపానికి పూజలు చేశారు. అనంతరం దీపప్రజ్వలన చేసి భక్తుల శివనామస్మరణ మధ్య ఎగురవేశారు.

బడుల్లో నేటి నుంచి ఆధార్ శిబిరాలు

తిరుపతి కలెక్టరేట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నుంచి ఈనెల 30వ తేది వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు గ్రామ వార్డు సచివాలయాల అధికారి జీవీ నారాయణరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 136 పాఠశాలలో 48743 మంది పిల్లల బయోమెట్రిక్‌ను ఆధార్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉందన్నారు.

30న ఆర్టీసీ వైద్యశాల ప్రారంభం

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఆర్టీసీ వైద్యశాల ఈ నెల 30న ప్రారంభానికి సిద్ధమైంది. సెంట్రల్ బస్టాండులోని డీపీటీవో కార్యాలయం వెనుక ఇరుకు స్థలంలో ఉన్న వైద్యశాల అసౌకర్యంగా ఉండటంతో ఉద్యోగులు, వైద్యసిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో అలిపిరి రోడ్డు డ్రైవర్స్ క్వార్టర్స్‌లోని దాదాపు 10సెంట్లలో రూ.4కోట్లతో భవనాన్ని నిర్మించారు. ఆధునిక సదుపాయాలు కల్పించారు. పనులన్నీ పూర్తి కావడంతో 30న రవాణా శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

వేదోక్తంగా లక్ష బిల్వార్చన

శ్రీకాళహస్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం లక్ష బిల్వార్చన వేదోక్తంగా జరిగింది. కార్తికమాసం పురస్కరించుకొని బుధవారం శాస్త్రోక్తంగా లక్షబిల్వార్చనను వేదపండితులు ఆరంభించిన విషయం తెలిసిందే... ఈ క్రమంలో రెండవ రోజు ఆలయంలోని మూల మూర్తుల సన్నిధిలో అర్చన వేదోక్తంగా కొనసాగింది.

యువకుడిపై పోక్సోకేసు నమోదు

సత్యవేడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తమిళనాడు ఊత్తుకోట్టైకు చెందిన ఏడేళ్ల బాలికను వరుసకు మేనమామ అయిన బాలుడు (17) పాఠశాలకు తీసుకెళతానని చెప్పి దాసుకుప్పం శివారుకు తీసుకొచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్ళిన బాలిక జరిగిన సంగతిని తల్లి తండ్రులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఘటన జరిగిన ప్రాంతం సత్యవేడు మండల పరిధిలో ఉండడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో విగ్రహంపై దాడి

రేణిగుంట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు గంగమ్మ తల్లి విగ్రహం పట్ల అపవిత్రంగా వ్యవహరించాడు. గ్రామస్తుల కథనం ప్రకారం తూకివాకం పంచాయతీ సూర్యనారాయణపురం ప్రాథమిక పాఠశాల ఎదురుగా వేపచెట్టు వద్ద బాట గంగమ్మ ఆలయం ఉంది. స్థానికంగా జులాయిగా తిరుగుతున్న నవీన్ అనే యువకుడు గురువారం మధ్యాహ్నం ఆలయం వద్దకు చేరుకున్నాడు. మద్యం తాగిన మత్తులో అమ్మవారి విగ్రహం రెండు చేతులు విరగ్గొట్టాడు. ఓమహిళ చూసి కేకలు వేయడంతో స్థానికులు ఆ యువకుడ్ని పట్టుకున్నారు. అయితే అతడు మత్తులో హల్‌చల్ చేశాడు. గ్రామస్తుల ఫిర్యాదుతో ఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేశారు. హిందూ సంఘాల సభ్యులు చేరుకుని గంగమ్మ విగ్రహానికి పూజలు నిర్వహించారు. విగ్రహంపై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల సభ్యుడు వెంకటాద్రి యాదవ్ డిమాండ్ చేశారు.

కెమికల్ లారీ బోల్తా



రేణిగుంట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గుజరాత్ నుంచి తమిళనాడు వెళ్తున్న కెమికల్ లారీ గురువారం గాజులమండ్యం వంతెన సమీపంలో బోల్తాపడింది. సీఐ మంజునాథ్ రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. లారీలో 30 టన్నుల కెమికల్ లీక్ కాకుండా 4 క్రేన్లను రప్పించారు. లారీని బయటికి తీయించారు.

సీసీ రోడ్డు సరే..చదును పనులెప్పుడు?



గ్రావెల్ తోలకుండా వదిలేసిన సీసీరోడ్డు

సత్యవేడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీసీరోడ్డు నిర్మించి రోడ్డుకు ఇరువైపులా మట్టిని తోలి చదును చేయకుండా వదిలేయడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సత్యవేడు-ఊత్తుకోట రోడ్డును మరమ్మత్తు చేసేందుకు రూ.4 కోట్లతో ఇటీవల పనులు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక పార్కు నుంచి వారపు సంత వరకు సీసీ రోడ్డును నిర్మించారు. సీసీరోడ్డు నిర్మాణం పూర్తయి రెండు నెలలవుతున్నా రోడ్డుకు ఇరువైపులా సంబంధిత కాంట్రాక్టర్ మట్టిని తోలి చదును చేయించలేదు సాధారణంగా సీసీరోడ్డు నిర్మాణం పూర్తయ్యాక ఇరువైపులా గ్రావెల్‌ను తోలి రోలర్‌తో పటిష్ట పరచి చదును చేయాల్సి ఉంది. అలా చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో వాహనదారులకు కష్టాలు అధికమయ్యాయి. మరోవైపు రోడ్డు మరమ్మతులు పనులు నెల రోజులుగా నిలిచిపోవడం గమనార్హం. సంబంధిత అధికారులు స్పందించి సీసీరోడ్డుకు ఇరువైపులా గ్రావెల్‌ను తోలి చదును చేసి, రోడ్డు పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు

మల్లిమడుగు డ్యామ్ నిర్మాణానికి రూ.291 కోట్లతో ప్రతిపాదనలు

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



మల్లిమడుగు డ్యామ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రేణిగుంట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు డ్యామ్ నిర్మాణానికి రూ.291 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మల్లిమడుగు డ్యామ్ గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ఈక్రమంలో గురువారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి డ్యామ్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐదేళ్ల క్రితమే మల్లిమడుగు డ్యామ్ ద్వారా సాగునీరు, తాగునీరు అందించాలని ఉద్దేశంతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మల్లిమడుగు డ్యామ్ నిర్మాణాన్ని నిలిపివేసిందన్నారు. డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించగా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. త్వరలో నిర్మాణ పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. డ్యామ్ వద్ద సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మల్లిమడుగు డ్యామ్ డీఈఈ చంద్రమౌళి, ఎంపీడీవో రవిచంద్ర, తాహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మునిచంద్రారెడ్డి, బుజ్జినాయుడు, రాజేంద్ర,నాథమునిరెడ్డి, మేచెలి భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఏర్పేడు : తెగిన జంగాలపల్లి చెరువును గురువారం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పరిశీలించారు. చెరువు పటిష్టత, సాగు భూముల వివరాలను ఇరిగేషన్ జేఈ జయకుమార్ ఆయనకు వివరించారు. మండలంలో చెరువుల అభివృద్ధి గురించి ఇరిగేషన్ ఈఈ శివారెడ్డి, డీఈ ఆదినారాయణనాయుడులతో చర్చించారు. తహసీల్దార్ భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం చెంచయ్య నాయుడు, నాగరాజ నాయుడు, పున్నారావు, బాలాజీ రావు, గురువులు పాల్గొన్నారు.

వరద బాధిత గిరిజనులను ఆదుకోండి



అధికారి సోముకు వివరిస్తున్న సుబ్బయ్య

శ్రీకాళహస్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : వరద ప్రాంత గిరిజనులను ఆదుకోవాలని ఏపీ గిరిజన సలహా మండలి సభ్యులు సుబ్బయ్య కోరారు. గురువారం కలెక్టరేట్ లోని జిల్లా గిరిజన అధికారి సోమును కలిసి లోతట్టు గిరిజన కాలనీ వాసుల సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ...బాధితులకు తక్షణం పునరావాసం కల్పించాలన్నారు. సహాయక చర్యలు అందించడంతోపాటు ఉపాధి తిరిగి పొందే వరకు ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



ఆశాను సత్కరిస్తున్న ఈవో దంపతులు,చిత్రంలో కళాకారులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆశ నాట్య సంగీత కళానిలయం బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. కార్తీకమాసం పురస్కరించుకుని ముక్కంటి ఆలయంలో గురువారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆశా బృందం నృత్యం అబ్బురపరిచింది. ఈవో బాపిరెడ్డి దంపతులు కళాకారులను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

తొట్టంబేడులో వరద నియంత్రణ చర్యలు



పరిశీలిస్తున్న అధికారులు



శ్రీకాళహస్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తొట్టంబేడు పంచాయతీ పరిధిలో అధికారులు గురువారం వరద నియంత్రణ చర్యలు చేపట్టారు. మూడు రోజులుపాటు కురిసిన వర్షాలకు తొట్టంబేడు పంచాయతీలోని ఎల్ఐసీ కాలనీ, ఈదులగుంట, బంగారమ్మ కాలనీ, బీడీ కాలనీలో వర్షపు నీరు స్తంభించింది. దాంతో తహసీల్దార్ భారతి, ఎంపీడీవో సురేంద్రనాథ్ స్పందించి గురువారం ఆయా కాలనీలో నేరు స్తంభించే కాలువలను యంత్రాలతో శుభ్రం చేయించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రేణిగుంట అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైల్వే వంతెన కింద్న కాలవలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. అంకమ్మ నాయుడు మెట్టకు వెళ్లే మార్గంలో గురువారం స్థానికులు దీనిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. నీటిలో ఎక్కువ రోజులు ఉండడంతో మృతదేహం గుర్తుపట్టలేని విధంగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ కార్డుల పంపిణీ



ఆధార్ కార్డులు పొందిన ఎస్టీ కాలనీ వాసులు

రేణిగుంట అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం ఎస్టీ కాలనీ వాసులకు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఆధార్ కార్డులను పంపిణీ చేశారు. సంచార జాతుల కుటుంబాలు ప్రభుత్వ గుర్తింపు లేక కొన్నాళ్లుగా తమ పిల్లలను వీరు పాఠశాలలో చేర్పించుకోలేకపోతున్నారు. తహసీల్దార్ స్పందించి ఎస్టీ కాలనీలో గురువారం ఆధార్‌కార్డు క్యాంపు నిర్వహించి 30 కుటుంబాలకు కార్డులను అందజేశారు.

తాగుబోతు హడావుడి



వంతెన పైనుంచి దింపుతున్న సిబ్బంది

రేణిగుంట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ బ్రిడ్జిపైన హైటెన్షన్ విద్యుత్ తీగల వద్ద మద్యం మత్తులో ఓ వ్యక్తి గురువారం హల్‌చల్ చేశాడు. ఒకటో నెంబర్ ప్లాట్ ఫారంపై వంతెన మీద నుంచి మద్యం తాగిన మత్తులో ఓ వ్యక్తి హైటెన్షన్ విద్యుత్ తీగలకు సమీపంలో వేలాడుతూ ఆందోళన గురిచేశాడు. ఆర్పీఎఫ్ పోలీసులు చేరుకుని ఆ వ్యక్తిని కిందకు దింపి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

వరదయ్యపాళెం ఎంపీపీ రాజీనామా

వరదయ్యపాళెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) వరదయ్యపాళెం ఎంపీపీ పద్మప్రియ గురువారం తన పదవికి రాజీనామా చేసేశారు. రాజీనామా లేఖను జడ్పీ సీఈవోకు అందజేశారు. రాజీనామా లేఖ అందినట్లు జడ్పీ సీఈవో ధ్రువీకరించారు. పదవీ కాలం 4 నెలల్లో ముగియనుండగా పదవికి రాజీనామా చేయడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. వరదయ్యపాళెం వైసీపీలో నెలకొన్న వర్గ విభేదాలకు నిదర్శనంగా అభిప్రాయపడుతున్నారు. ఎంపీపీ రాజీనామ ఆమోద విషయం జడ్పీ సీఈవో పరిధిలో ఉంది. విచారణ జరిపి ఎంపీపీ రాజీనామాను ఆమోదించాల్సి ఉంది.

నిలిచిన వాననీటితో కష్టాలు

వరదయ్యపాళెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా వర్షాలకు వగత్తూరు వద్ద మెయిన్ వరదవ కాలువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో కాలువ తెగిపోయింది. దీంతో ఎస్టీ కాలనీలో వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. కాలనీ పూర్తిగా జలమయమై కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోవర్ధనపురం చెక్‌పోస్టు వద్ద సంతవేలూరు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు పూడిపోయి వర్షపు నీరు రోడ్డుపై నిలిచి పోయింది. దీంతో ఆ మార్గంలో వెళ్ళే ప్రయాణికులు, వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొట్టుకుపోయిన కాజ్‌వే



కేవీబీపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) భారీ వర్షాలకు గురువారం ఎం.ఏ.రాజులకండ్రిగ వద్ద కాళంగి యేరుపై మట్టి వంతెన కొట్టుకు పోయింది. యేటి ప్రవాహం తగ్గడంతో గ్రామస్తులు జేసీబీ ద్వారా మట్టిపోసి రాకపోకలకు అనువుగా తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం, ఎంపీడీవో మాలతి, ఈఓపీఆర్డీ జి.రెడ్డి, డీఈ రాంబాబుతో కలిసి పరిశీలించారు. పెరిందేశం దళితవాడలో 4 పూరిళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయని తహసీల్దార్ రోశయ్య చెప్పారు.